# తెలుగురాష్ట్రం

APTEL/2016/66202

దినపత్రిక

అమలాపురం | సంపుటి : 10 సంచిక : 13 | ఎడిటర్ : అయితాబత్తుల రాజశేఖర్ | బుధవారం 05 మార్చి 2025 | పేజీలు 8 వెల : 5/-

published : Amlapuram Vol:10 Issue : 13 05-03-2025 Monday Edirtor : AITHABATHULA RAJASEKHAR Pages : 8 Rs: 5/-







## గ్రేటాది గ్రేటా..

# రాజశేఖరా..

## ఎమ్మెల్సీ ఎన్నికల్లో పేరాబత్తుల గ్రేట్ విక్టరీ

**70 వేల మెజార్టీతో ఘన విజయం**



**అమరావతి మార్చి 04 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల హవా. ఉభయ గోదావరి పట్టభద్రుల ఎమ్మెల్సీగా కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం ఘన విజయం సాధించారు. .ఎనిమిది రౌండ్ల్ జరిగిన లెక్కింపులో ఆయన తన సమీప పత్యర్థి, పీడీఎఫ్ కు చెందిన దిడ్ల వీర రాఘవులుపై సుమారు 77 వేల ఓట్ల మెజార్టీతో గెలుపొందారు.. ఏడు, ఎనిమిది రౌండ్ల ఓట్ల లెక్కింపు వివరాలు అందాల్సి ఉంది.. ఇప్పటికే ఆరో రౌండు కౌటింగ్ పూర్తయింది. ఈ రౌండ్ ముగిసే నాటికి కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం 60 వేల ఓట్ల మెజార్టీతో ముందంజలో ఉన్నారు.. ఆరో రౌండ్ పూర్తయ్యేనాటికి మొత్తం 1,68,000 ఓట్ల లెక్కింపు పూర్తి చేశారు. అందులో చెల్లుబాటు అయినవి 1,53,182 కాగా, 14,818 చెల్లనివిగా ఉన్నాయి. ఆరో రౌండ్లో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం 16,254 ఓట్లు సాధించారు. ఇప్పటి వరకు ఆయనకు మొత్తంగా 96,291 ఓట్లు వచ్చాయి. ఆరో రౌండ్లో పీడీఎఫ్ అభ్యర్థి దిడ్ల వీర రాఘవులుకి 5,949 ఓట్లు వచ్చాయి. దీంతో ఆయనకు ఇప్పటివరకు వచ్చిన మొత్తం ఓట్లు 35,614కు చేరాయి. ఈ రౌండ్ ముగిసే సమయానికి కూటమి అభ్యర్థి రాజశేఖరం 60,677 ఓట్ల ఆధిక్యంలో కొనసాగుతున్నారు. గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొత్తంగా 2,18,902 ఓట్లు పోలవగా.. మొత్తం 8 రౌండ్లలో ఫలితాలు వెలువడనున్నాయి. ఓట్ల లెక్కింపు ప్రక్రియలో దాదాపు 700మంది కౌంటింగ్ సిబ్బంది మూడు షిఫ్టుల్లో పాల్గొంటున్నారు.

**రాజశేఖరం ఆనందం**

తన విజయం పట్ల పేరాబత్తుల రాజశేఖరం ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ ఘన విజయం సాధించేందుకు తనను కూటమి అభ్యర్థిగా ప్రకటించిన సీఎం చంద్రబాబునాయుడుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే,

- తరువాయి 2లో..





## ఏపీ డిజిటల్ అక్షరాస్యత మారాలి :చంద్రబాబు

**అమరావతి మార్చి 04 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

**ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రంలోని ప్రతి పౌరుడిని డిజిటల్ అక్షరాస్యుడిగా మార్చాలని సంకల్పించారు. ఈ లక్ష్యంతో రాష్ట్రాన్ని సంపూర్ణ డిజిటల్ అక్షరాస్యత కలిగిన రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు అధికారులను కృషి చేయాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో పీపుల్స్ పర్సెప్షన్, ఆర్టీజీఎస్‌పై సీఎం చంద్రబాబు సచివాలయంలో సమీక్ష నిర్వహించారు.**

**వాట్సాప్ గవర్నెన్స్ - సులభతర సేవలు**

ప్రభుత్వం ప్రవేశపెట్టిన వాట్సాప్ గవర్నెన్స్ గురించి సమీక్షిస్తూ, ప్రజలందరూ దీన్ని సులభంగా ఉపయోగించుకునేలా చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు. ప్రజలు ప్రభుత్వ సేవల కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా అన్ని సేవలు అందుబాటులోకి తెచ్చినట్లు ఆయన తెలిపారు. అయితే, ప్రజల్లో దీనిపై అవగాహన తక్కువగా ఉన్నందున, మరింత ప్రచారం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి జిల్లాలో కలెక్టర్లు బాధ్యత తీసుకుని వాట్సాప్ గవర్నెన్స్‌ను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆదేశించారు. సచివాలయాలు, సచివాలయ సిబ్బంది ద్వారా దీని గురించి అవగాహన పెంచాలని సూచించారు. ప్రజలు ప్రభుత్వ సేవలను పొందడమే కాకుండా, తమ ఫిర్యాదులు, అర్జీలు కూడా వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా పంపవచ్చని సీఎం చంద్రబాబు చెప్పారు. అంతేకాదు, నిరక్షరాస్యులు కూడా తమ ఫిర్యాదులను వాయిస్ మెసేజ్ ద్వారా ప్రభుత్వానికి తెలియజేసే సదుపాయం త్వరలో అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు వెల్లడించారు. డిజిటల్ అక్షరాస్యత పెరిగితే వాట్సాప్ గవర్నెన్స్ వినియోగం కూడా పెరుగుతుందని సీఎం అభిప్రాయపడ్డారు.

**ఆర్టీజీఎస్ ద్వారా విస్తృత సేవలు**

ప్రస్తుతం వాట్సాప్ ద్వారా 200 రకాల సేవలు ప్రజలకు అందిస్తున్నామని, ఈ నెలాఖరు వరకు మరో 150 అదనపు సేవలను జతచేస్తామని ఐటీ, రియల్ టైమ్ గవర్నెన్స్ కార్యదర్శి భాస్కర్ కాటమనేని సీఎం చంద్రబాబుకు

- తరువాయి 2లో..

## ఉద్యోగాల దరఖాస్తునకు వయోపరిమితి పెంపు


**అమరావతి మార్చి 04 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ప్రభుత్వ ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు వయోపరిమితిని పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నాన్ యూనిఫామ్ ఉద్యోగాలకు వయోపరిమితి 34 నుంచి 42 ఏళ్లకు, యూనిఫామ్ ఉద్యోగాలకు వయోపరిమితి రెండేళ్లు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఈ ఏడాది సెప్టెంబరులో జరిగే నియామకాలకు వయోపరిమితి పెంపు వర్తిస్తుందని ప్రభుత్వం తెలిపింది. ఏపీపీఎస్సీతో పాటు పలు ఏజెన్సీలు నిర్వహించే డైరెక్ట్ రిక్రూట్మెంట్ పరీక్షలకు సైతం ఈ వయోపరిమితి పెంపు వర్తించనుంది.

## పరిశ్రమ ప్రేక్షకుడిగా ఉండకూడదు : మోడీ



న్యూఢిల్లీ : ప్రధాని మోడీ మంగళవారం పోస్ట్ బడ్జెట్ వెబినార్‌లో ఎంఎస్ఎంఇ రంగంపై మాట్లాడారు. ఈ సందర్భంగా మోడీ మాట్లాడుతూ..'ఈరోజు ప్రపంచానికి విశ్వసనీయ భాగస్వామి కావాలి. పరిశ్రమ కేవలం ప్రేక్షకుడిగా ఉండకూడదు. ప్రపంచ సరఫరా గొలుసులో అవకాశాలను వెతకాలి. ఈరోజు భారతదేశం ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు గ్రోత్ ఇంజన్‌గా మారింది. కష్టకాలంలోనూ దేశం తన సామర్థ్యాన్ని నిరూపించుకుంది' అని అన్నారు. అలాగే చిన్న మధ్యతరహా పరిశ్రమల్ని అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు. 14 రంగాల్లో ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటివ్ (పిఎల్ఐ) పథకం 1.5 లక్షల కోట్లకు పైగా పెట్టుబడి వల్ల 13 లక్షల కోట్ల విలువైన ఉత్పత్తికి పెంచింది అని గుర్తు చేశారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా పెట్టుబడులను ఆకర్షించడంలో రాష్ట్రాలు కీలక పాత్ర పోషిస్తాయని, ప్రగతిశీల విధానాలను అమలు చేసే రాష్ట్రాలకే పెట్టుబడిదారులు ప్రాధాన్యత ఇస్తారని ఆయన పేర్కొన్నారు. కేంద్ర బడ్జెట్ ఆర్థికాభివృద్ధికి బలమైన పునాది వేసిందని అన్నారు.




## ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ క్లీన్ స్వీప్

వార్త 2లో..

## యువత ఆకాంక్షలకు అనుగుణంగా పని చేయాలి

**-మంత్రి లోకేష్ ను కలిసిన నూతన ఎమ్మెల్సీలు రాజా, రాజశేఖర్**



**అమరావతి మార్చి 04 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, పేరాబత్తుల రాజశేఖర్ మంగళవారం మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మంత్రి నారా లోకేష్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్సీలను మంత్రి అభినందించారు. మంత్రి లోకేష్ మాట్లాడుతూ... ఈ విజయంతో మనపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. రాష్ట్రంలో యువత మనపై పెట్టుకున్న ఆశలను నెరవేర్చే దిశగా చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. 5ఏళ్లలో 20లక్షల ఉద్యోగాల కల్పనను కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని లోకేష్ చెప్పారు. మంత్రిని కలిసిన వారిలో దేవినేని ఉమ, నెట్టెం రఘురాం, ముమ్మిడివరం ఎమ్మెల్యే సుబ్బరాజు, పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, మాజీ ఎమ్మెల్యే వర్మ, లిడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యాలరావు ఉన్నారు.



## తల్లికి వందనంపై త్వరలోనే..

# గైడ్ లైన్స్

**ఎట్టిపరిస్థితుల్లోనూ మార్చి నెలలోనే డీఎస్సీ నోటిఫికేషన్: మంత్రి నారా లోకేశ్**

**అమరావతి మార్చి 04 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

అమరావతి: కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పథకాన్ని త్వరలోనే అమలుచేయనుందని ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ తెలిపారు. తల్లికి వందనం అమలుకు సంబంధించిన గైడ్ లైన్స్ ను త్వరలోనే ప్రకటిస్తామని శాసన మండలిలో లోకేష్ వెల్లడించారు. తల్లికి వందనం పథకం పై శాసన మండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి నారా లోకేష్ సమాధానం ఇచ్చారు. తల్లికి వందనం పథకానికి ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ 2025-26లో రూ.9,407 కోట్లు కేటాయించినట్లు మంత్రి తెలిపారు.

**ఎట్టిపరిస్థితుల్లోనూ మార్చి నెలలోనే డీఎస్సీ నోటిఫికేషన్**

ఎట్టిపరిస్థితుల్లోనూ మార్చి నెలలో డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చే బాధ్యత కూటమి ప్రభుత్వానిదేనని ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. డీఎస్సీ నోటిఫికేషన్ పై శాసన మండలిలో వైసీపీ సభ్యుల ప్రశ్నకు ఈరోజు మంత్రి సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. నిరుద్యోగ యువకులు ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నారు. వారందరికీ సమాధానం చెప్పాల్సిన అవసరం

- తరువాయి 2లో..



## ఈ నెల 5, 6 తేదీల్లో మరోసారి ఢిల్లీకి సీఎం చంద్రబాబు

**5న ఉదయం గన్నవరం విమానాశ్రయం నుంచి ఢిల్లీ పయనం**

**ప్రధాని మోదీతో పాటు పలువురు కేంద్ర మంత్రులతో సీఎం భేటీ**

**అదేరోజు రాత్రి ఢిల్లీ నుంచి విశాఖపట్నంకు తిరుగు పయనం**

**6న ఉదయం దగ్గుబాటి వెంకటేశ్వరరావు పుస్తకావిష్కరణ కార్యక్రమంలో పాల్గొననున్న సీఎం**

**ఆ రోజు మధ్యాహ్నం 1.50 గంటలకు విశాఖ నుంచి మళ్లీ ఢిల్లీకి చంద్రబాబు**

**అమరావతి మార్చి 04 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**



ఏపీ సీఎం చంద్రబాబునాయుడు ఈ నెల 5, 6 తేదీల్లో మరోసారి ఢిల్లీ వెళ్లనున్నారు. 5న ఉదయం గన్నవరం విమానాశ్రయం నుంచి ఢిల్లీ పయనమవుతారు. ఆ రోజు ఢిల్లీలో ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షాతో పాటు పలువురు కేంద్ర మంత్రులతో ముఖ్యమంత్రి భేటీ అవుతారు. అదేరోజు రాత్రి ఢిల్లీ నుంచి విశాఖపట్నంకు చేరుకుంటారు. 6వ తారీఖున ఉదయం తన తోడల్లుడు దగ్గుబాటి వెంకటేశ్వరరావు రచించిన ప్రపంచ చరిత్ర పుస్తకావిష్కరణ కార్యక్రమంలో పాల్గొంటారు. ఈ కార్యక్రమం ముగిసిన తర్వాత మధ్యాహ్నం 1.50 గంటలకు విశాఖ నుంచి మళ్లీ ఢిల్లీకి వెళతారు. అక్కడ వివిధ కార్యక్రమాల్లో పాల్గొని, రాత్రికి అక్కడే బస చేస్తారు. 7వ తేదీన అమరావతికి చేరుకుని, వెలగపూడి సచివాలయంలో జరిగే కేబినెట్ సమావేశంలో పాల్గొంటారు. చంద్రబాబు అధ్యక్షతన ఈ సమావేశం మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభం అవుతుంది.

తెలుగురాష్ట్రం దినపత్రిక
https://epaper.teluguraastram.com
బుధవారం
05 మార్చి 2025
ఎడిటోరియల్, మొదటి పేజీ తరువాయి

## సంపాదకీయం

# లోక్‌పాల్ వర్సెస్ న్యాయమూర్తులు

ఉన్నత స్థాయిలోని అవినీతిని నిరోధించడానికి 'లోక్‌పాల్'ను ఏర్పాటు చేశారు. సిట్టింగ్ హైకోర్టు న్యాయ మూర్తులపై వచ్చిన ఫిర్యాదులను పరిశీలించే అధికారం తమకు ఉందని లోక్‌పాల్ అభిప్రాయపడింది. దీంతో లోక్‌పాల్ అధికారాల పరిధి, న్యాయ మూర్తులకు లభించే రక్షణల గురించిన ప్రశ్నలు చర్చనీయాంశాలయి నాయి. అంతేకాదు, న్యాయవ్యవస్థ స్వతంత్రత మీద నీలినీడలు ఏర్పడినాయి.

2025 ఫిబ్రవరి 20న సుప్రీంకోర్టు న్యాయమూర్తులు బీఆర్ గవాయ్, సూర్యకాంత్, ఏఎస్ ఓకాలతో కూడిన ప్రత్యేక ధర్మాసనం లోక్‌పాల్ జారీ చేసిన ఎంక్వైరీ ఉత్తర్వుల మీద చర్చించడానికి ప్రత్యేకంగా సమావేశమయ్యింది. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి ఏఎం ఖన్విల్కర్ నేతృత్వంలోని ఏడుగురు సభ్యుల లోక్‌పాల్ బెంచ్... 'హైకోర్టు న్యాయమూర్తులు లోక్‌పాల్, లోకాయుక్త చట్టం%-%2013' పరిధిలోకి వస్తారని అభిప్రాయపడింది. పార్లమెంట్ తయారు చేసిన చట్టం ద్వారా ఏర్పాటైన హైకోర్టులలోని న్యాయ మూర్తులు కాబట్టి వారు ఈ చట్టాల పరిధిలోకి వస్తారని లోక్‌పాల్ బెంచ్ అభిప్రాయపడింది.

'ఇది చాలా కలవరపెట్టే విషయం' అని జస్టిస్ గవాయ్ విచారణ సందర్భంగా వ్యాఖ్యానించారు. అంతకు ముందు రోజు ఈ అంశాన్ని సుప్రీంకోర్టు తనకు తానుగా స్వీకరించి విచారణ చేపట్టింది. ప్రజాహితాన్ని దృష్టిలో పెట్టుకొని, ప్రాథమిక హక్కుల ఉల్లంఘనలు జరుగకుండా ఉండటానికి సుప్రీంకోర్టు తన అధి కారాన్ని వినియోగించుకొని ఈ విషయంలో జోక్యం చేసుకుంది. లోక్‌పాల్ జారీ చేసిన ఉత్తర్వులపై స్టేని మంజూరు చేసింది.

అంతేకాదు లోక్‌పాల్ విచారణ చేపట్టిన హైకోర్టు న్యాయమూర్తుల పేర్లు బహిర్గతం చేయకూడదని కూడా ఆదేశించింది. హైకోర్టు న్యాయమూర్తులపై విచారణ చేపట్టే ముందు లోక్‌పాల్ 1991వ సంవత్సరంలో న్యాయమూర్తి కె. వీరాస్వామి కేసుని కూడా ఉదహ రించింది. ఉన్నత న్యాయస్థానంలోని న్యాయమూర్తిని పబ్లిక్ సర్వెంట్స్ నిర్వచనం నుండి మినహాయించలేరు. అందుకని హైకోర్టు న్యాయమూర్తుల మీద తాము విచారణని చేపట్టినామని లోక్‌పాల్ తన ఉత్తర్వులలో పేర్కొంది.

1991వ సంవత్సరంలో 'కె. వీరాస్వామి వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా' కేసులో ఐదుగురు న్యాయమూర్తుల సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ప్రకారం %-% న్యాయ మూర్తులందరూ 'అవినీతి నిరోధక చట్టం%-%1988' ప్రకారం పబ్లిక్ సర్వెంట్స్ అని పేర్కొంది. హైకోర్టు న్యాయమూర్తి లేదా ప్రధాన న్యాయమూర్తి లేదా సుప్రీంకోర్టు న్యాయమూర్తిపై ఫిర్యాదు దాఖలైనప్పుడు కేసు నమోదు చేయడానికన్నా ముందు భారత ప్రధాన న్యాయమూర్తిని సంప్రదించాలని కూడా ఆ తీర్పులో పేర్కొన్నారు.

న్యాయమూర్తులను %-% అవసరం లేని ప్రాసిక్యూషన్ నుంచి, అనవసర వేధింపుల నుండి రక్షించడానికి రాష్ట్రపతి, భారత ప్రధాన న్యాయమూర్తిని సంప్రదించాలి. ప్రధాన న్యాయమూర్తి తన ముందు ఉంచిన అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకొని, ఆ విషయంలో సంతృప్తి చెందిన తరువాత సంబంధిత న్యాయ మూర్తిపై ప్రాసిక్యూషన్ ప్రారంభించడానికి లేదా ఎఫ్ఐఆర్‌ని విడుదల చేయడానికి రాష్ట్రపతికి తగు సలహాని ఇవ్వాలి.

ఈ తీర్పుని ఆధారం చేసుకొని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి, లోక్‌పాల్ ఖన్విల్కర్ నేతృత్వంలోని బెంచ్ న్యాయమూర్తులపై వచ్చిన ఫిర్యాదులను భారత ప్రధాన న్యాయమూర్తి పరిశీలనకి పంపింది. 2013వ చట్టంలోని సెక్షన్ 20(4) ప్రకారం ఫిర్యాదును పరిష్కరించడానికి అవసరమైన కాలపరిమితిని దృష్టిలో పెట్టుకొని కేసుని నాలుగు వారాల పాటు వాయిదా వేయాలని ఆదేశించింది.

హైకోర్టు న్యాయమూర్తులు లోక్‌పాల్ అనుకున్నట్టు చట్ట బద్ధమైన అధికారులు మాత్రమే కాదని, వాళ్ళు రాజ్యాంగ బద్ధమైన న్యాయమూర్తులని సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ గవాయ్, జస్టిస్ ఏఎస్ ఓకా విచారణ సందర్భంలో అన్నారు. సుప్రీంకోర్టు వెలి బుచ్చిన ఆందోళనలో భారత సొలిసి టర్ జనరల్ తుషార్ మెహతా, న్యాయవాది కపిల్ సిబాల్ కూడా పాలుపంచుకున్నారు.

లోక్‌పాల్, లోకాయుక్త చట్టంలోని సెక్షన్ 14 పరిధిలోకి వస్తాయని లోక్‌పాల్ అభిప్రాయపడింది కానీ దాని యోగ్యతలను లోక్‌పాల్ ఇంకా పరిశీలించలేదని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. అయితే లోక్‌పాల్ అభిప్రాయం తప్పని సుప్రీంకోర్టు గట్టిగా చెప్పింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 214(1)ను లోక్‌పాల్ విస్మరించిందని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. ఈ అధికరణం ప్రకారం హైకోర్టులను ఏర్పాటు చేస్తారు.

రాజ్యాంగం కొన్ని వ్యవస్థలకు రక్షణలను కల్పించింది.అందులో రాష్ట్రపతి, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, ఎలక్షన్ కమిషనర్లు వస్తారు. వీళ్ళే కాదు హైకోర్టు న్యాయమూర్తులూ వస్తారు. లోక్‌పాల్ అభిప్రాయం న్యాయవ్యవస్థ స్వతంత్రతకు సవాలు విసురుతుంది. న్యాయ వ్యవస్థ స్వతంత్రత మీద నీలి నీడలు కమ్ముకుంటాయి. ఈ జోక్యం వల్ల అత్యున్నత న్యాయ వ్యవస్థ బలహీనపడుతుంది. న్యాయ వ్యవస్థలో పరోక్ష జోక్యాలు, ఒత్తిళ్లు పెరిగిపోతాయి.


ప్రేరేపిత ఆరోపణల నుంచి రక్షణ లేకుండా పోతుంది. అయితే వారి మీద ఎలాంటి విచారణ లేకపోతే జవాబుదారీ తనం లేకుండా పోతుంది. హైకోర్టు న్యాయ మూర్తుల మీద వచ్చిన ఆరోపణలను విచారించడానికి, తగు చర్యలు తీసుకోవడానికి సరైన యంత్రాంగం లేదు. దీనివల్ల అవినీతికి స్థానం దొరికేలా ఉంటుంది. సుప్రీంకోర్టు ఈ విషయాన్ని కూడా పరిగణనలోకి తీసుకుంది. ప్రస్తుతం ఉన్న విధానం మెరుగు పడాల్సిన అవసరం ఉందని దేశ అత్యున్నత న్యాయస్థానం భావించింది. ఇటీవలి కాలంలో తమ పరిధికి మించి ఉత్తర్వులను, బెయిల్ షరతులను విధిస్తున్న హైకోర్టు న్యాయమూర్తులను చూస్తున్నాం. అదే విధంగా కేసు విచారణ సందర్భంలో, బయట సమావేశాల్లో రాజ్యాంగ స్ఫూర్తికి భంగం కలిగేలా ప్రవర్తిస్తున్నారు. వారిపై చర్యలు తీసుకున్న సందర్భాలు లేవు.

వారి పరిధి నుంచి కేసుల ఉపసంహరణ లాంటి చర్యలను కూడా సుప్రీంకోర్టు తీసుకోవడం లేదు. న్యాయవ్యవస్థ స్వతంత్రత ఎంత ముఖ్యమో... జవాబు దారీ తనం కూడా అంతే ముఖ్యం. లోక్‌పాల్ అభిప్రాయం సరైంది రాకపోవచ్చు. కానీ చాలా అంశాలు సుప్రీం తీర్పు ముందుకు వస్తున్నాయి. సుప్రీం కోర్టు ఏం చేస్తుందో చూడాలి మరి!

# ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ క్లీన్ స్వీప్

**అమరావతి మార్చి 04 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు టీడీపీకి మరో విజయాన్ని అందించాయి. గతంలో మూడుసార్లు విజయం సాధించిన టీడీపీ, ఈసారి కూడా రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాల్లో ఘన విజయం సాధించి, మొత్తం ఐదు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలను కైవసం చేసుకుంది. ఈ విజయంతో రాష్ట్ర రాజకీయాల్లో టీడీపీ దూకుడు కొనసాగుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు.




**గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ హవా**

గతంలో ఎప్పుడు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగితే, టీడీపీ తన ముద్ర వేసిన విషయాన్ని మరోసారి రుజువు చేసుకుంది. 2023లో జరిగిన మూడు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులు విజయం సాధించగా, తాజాగా 2025లో మరో రెండు స్థానాలను క్లీన్ స్వీప్ చేసింది. తూర్పు గోదావరి-పశ్చిమ గోదావరి పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంలో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం విజయం సాధించారు.ఉమ్మడి కృష్ణా-గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంలో టీడీపీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ గెలుపొందారు.

**ఓట్ల లెక్కింపు - విజయం**

ఉమ్మడి కృష్ణా-గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం ఆలపాటి రాజేంద్రప్రసాద్ 82,320 ఓట్ల భారీ మెజారిటీ సాధించారు. ఆయన ఏడో రౌండ్‌కే అత్యధిక ఓట్లు సాధించి విజయం ఖరారు చేసుకున్నారు. తూర్పు గోదావరి-పశ్చిమ గోదావరి పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం పేరాబత్తుల రాజశేఖరం 71,063 ఓట్ల ఆధిక్యతతో గెలిచారు. ఆయన 51% ఓట్ల మద్దతును సంపాదించారు. 2023లో టీడీపీ విజయం సాధించిన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలు ఉత్తరాంధ్ర గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ - వేపాడ చిరంజీవి, తూర్పు రాయలసీమ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ - కంచర్ల శ్రీకాంత్ , పశ్చిమ రాయలసీమ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ - భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి

**గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఫలితాల్లో టీడీపీ విజయ రహస్యం**

యువత మద్దతు పెరగడం - గ్రాడ్యుయేట్ ఓటర్లు తమ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని టీడీపీ వైపు మొగ్గు చూపారు. నారా చంద్రబాబు నాయుడు నాయకత్వం - టీడీపీ పాలనలో వచ్చిన అభివృద్ధి, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్న ఆలోచన ఓటర్లను ఆకర్షించాయి. బీజేపీ-జనసేన-టీడీపీ కూటమి ప్రభావం - ఎన్డీయే కూటమి ప్రభావం ఈ ఎన్నికల్లో స్పష్టంగా కనిపించింది. జగన్ పాలనపై ప్రజల్లో అసంతృప్తి - రాష్ట్రంలోని నిరుద్యోగ సమస్య, విద్యార్థులకు పథకాలు సరిగా అమలు కాకపోవడం ఓటింగ్‌పై ప్రభావం చూపించాయి.

ఎన్డీయే ఓటింగ్ శాతం పెరగడం - 2024 సాధారణ ఎన్నికలతో పోల్చితే ఈసారి ఎన్డీయే కూటమికి 10% ఓట్లు పెరిగాయి, అంటే పట్టభద్రులలో కూటమి పట్ల ఆసక్తి పెరిగిందని అర్థం. టీడీపీ తాత్కాలిక విజయం కాదని, ఓటర్ల మద్దతు పొడవుగా కొనసాగుతుందని తెలుస్తోంది.యువత, పట్టభద్రులు ఎన్డీయే కూటమిని ఆశాజనకంగా చూస్తున్నారు.2024 సాధారణ ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమికి మరింత బలమైన స్థానం ఏర్పడే అవకాశం ఉంది. 2023లో మూడు, 2025లో రెండు - మొత్తం ఐదు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలు టీడీపీ ఖాతాలోకి వెళ్లడం పార్టీ కార్యకర్తలలో ఉత్సాహాన్ని పెంచింది.

# ఎమ్మెల్యే కోటాలో మండలికి నాగబాబు!

## చంద్రబాబు, పవన్ కల్యాణ్ భేటీలో అభ్యర్థిత్వం ఖరారు

## బడ్జెట్, పథకాల అమలుపై గంటపాటు సీఎం ఛాంబర్‌లో చర్చ



**అమరావతి మార్చి 04 (తెలుగురాష్ట్రం ప్రతినిధి) :**

ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సోమవారం అసెంబ్లీలోని సీఎం ఛాంబర్‌లో భేటీ అయ్యారు. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలు సహా వివిధ అంశాలపై గంటపాటు ఇద్దరూ చర్చించారు. ఎమ్మెల్యేల కోటా ఎమ్మెల్సీ ఎన్నికలు, అభ్యర్థుల ఎంపికపై ఇద్దరూ కొద్దిసేపు చర్చించారు. ఎన్నికలు జరగనున్న ఐదు స్థానాల్లో ఒకటి నాగబాబుకు ఖరారు చేశారు. సీఎం చంద్రబాబు శాసనసభలో తన స్థానంలో కూర్చుని ఉండగా.. పవన్ కల్యాణ్ ఆయన వద్దకు వెళ్లారు. ఈ సందర్భంగా పక్కపక్కనే కూర్చుని కొద్ది నిమిషాలు మాట్లాడుకున్నారు. అనంతరం ఇద్దరూ కలిసి ఛాంబర్‌కు వెళ్లారు. రాష్ట్ర బడ్జెట్‌లో వివిధ శాఖలకు కేటాయింపులపై పవన్ కల్యాణ్ ఈ సందర్భంగా తన అభిప్రాయాలు చెప్పారు. రాష్ట్ర బడ్జెట్‌లో అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సమతూకంతో నిధులు కేటాయించారని పేర్కొన్నారు. మే నెల నుంచి ప్రారంభించే తల్లికి వందనం, అన్నదాతా సుఖీభవ పథకాలపైనా వారి మధ్య చర్చ జరిగింది. పంచాయతీరాజ్ శాఖ ద్వారా రహదారుల పనులు చాలావరకు చేశామని.. తాగునీటి సరఫరాపై ఎక్కువ దృష్టిపెట్టామని చంద్రబాబుకు డిప్యూటీ సీఎం వివరించారు. ఉపాధి హామీ ద్వారా రాష్ట్రానికి ఎక్కువ నిధులు రాబట్టుకుని పెద్దఎత్తున పనులు చేయాల్సిన అవసరంపైనా చర్చించారు. రాష్ట్రంలో ఉద్యోగాల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని పవన్ కల్యాణ్ సూచించారు. గత ప్రభుత్వ హయాంలో పెట్టుబడిదారుల్ని భయపెట్టి తరిమేయడంతో రాష్ట్రానికి వచ్చేందుకు ఆలోచిస్తున్నారని.. వారిని ఆకర్షించేందుకు గట్టి ప్రయత్నం చేస్తున్నామని చంద్రబాబు ఆయనకు వివరించారు. ఉపాధి, ఉద్యోగకల్పనే లక్ష్యంగా పెట్టుబడిదారులతో మాట్లాడుతున్నామని తెలిపారు.



## గ్రేటాది గ్రేటా రాజశేఖరా..

## ఎమ్మెల్సీ ఎన్నికల్లో పేరాబత్తుల గ్రేట్ విక్టరీ



తమకు మద్దతుగా నిలిచిన పట్టభద్రుల ఓటర్లకు ధన్యవాదాలు తెలిపారు. ఎన్నికల ప్రచార సమయంలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడానికి అన్ని ప్రయత్నాలు చేస్తానని, పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. నిరుద్యోగ సమస్యను ప్రభుత్వానికి పట్టబద్రుల తరఫున మాట్లాడుతానని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వ హయాంలో నిరుద్యోగ యువతను నిర్లక్ష్యంగా చూడటమే కాకుండా, అనాలోచిత విధానాలతో ఇబ్బందులకు గురి చేశారని దుయ్యబట్టారు.

### ప్రధాన లక్ష్యం

పట్టభద్రుల ఎమ్మెల్సీగా ఎన్నికైన తర్వాత తన ప్రధాన లక్ష్యం యువతకు ఉపాధి అవకాశాలను పెంచడం, విద్యా రంగంలో మరిన్ని సంస్కరణలు తీసుకురావడం అని పేరాబత్తుల పేర్కొన్నారు. పట్టభద్రుల సమస్యలు పరిష్కారం కోసం వారికి న్యాయం చేయడమే తన ప్రధాన బాధ్యత అని స్పష్టం చేశారు. తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమిగా సమష్టిగా కృషి చేసిన ఫలితమే ఈ విజయమని పేర్కొన్నారు.

### మద్దతుదారుల సంఖ్య

ఇటీవల జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మద్దతుదారుల సంఖ్య పెరగడం విశేషం. ముఖ్యంగా యువత, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆయనకు మద్దతు తెలపడం, ప్రచారంలో పెద్ద ఎత్తున పాల్గొనడం విజయాన్ని మరింత బలపరిచింది. ప్రత్యేకంగా తెలుగు దేశం పార్టీ విజయాన్ని తన ఖాతాలో వేసుకోవడం విశేషంగా మారింది. ఈ విజయంతో కూటమి నేతలు మరింత ఉత్సాహంగా ముందుకు సాగుతున్నారు. పట్టభద్రుల సమస్యల పరిష్కారం కోసం పేరాబత్తుల రాజశేఖరం ఎలాంటి చర్యలు తీసుకుంటారో చూడాలి. అలాగే, నిరుద్యోగ సమస్య, ఉద్యోగ భద్రత, విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు వంటి అంశాల్లో ప్రభుత్వం వైఖరిని ఎలా మార్చుతుందనేది ఆసక్తికరంగా మారింది. ఈ ఎన్నికల ఫలితాలు వచ్చే అసెంబ్లీ ఎన్నికలపై కూడా ప్రభావం చూపించే అవకాశముందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

### పట్టభద్రుల హక్కుల సాధనకు కృషి చేస్తా: పేరాబత్తుల రాజశేఖరం

కూటమి అభ్యర్థిగా ఇంత గొప్ప విజయం సాధించినందుకు సంతోషంగా ఉందని పేరాబత్తుల రాజశేఖరం అన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు, రెండు జిల్లాల పట్టభద్రుల ఓటర్లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పట్టభద్రుల హక్కుల సాధనకు కృషి చేస్తానని ఈ సందర్భంగా తెలిపారు. "నిరుద్యోగ యువత పట్ల గత ప్రభుత్వం అనాలోచితంగా వ్యవహరించింది. ఈ 8 నెలల కాలంలోనే రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వచ్చాయి. సీఎంగా

## మొదటి పేజీ నుంచి

ప్రమాణ స్వీకారం చేశాక చంద్రబాబు తొలి సంతకం డీఎస్సీపైనే చేశారు. ఎన్నికల ప్రక్రియ పూర్తికాగానే డీఎస్సీ నోటిఫికేషన్ వస్తుంది. రాష్ట్రంలో నిరుద్యోగ యువత లేకుండా, అందరికీ ఉద్యోగాలు వచ్చేలా నా వంతు ప్రయత్నం చేస్తా" అని తెలిపారు.

### రౌండ్లలో పేరాబత్తుల రాజశేఖరం సాధించిన ఓట్లు ఇలా..

రౌండ్ 1 - 16,520 రౌండ్ 2 - 16,212
రౌండ్ 3 - 16,191 రౌండ్ 4 - 15,482
రౌండ్ 5 - 15,632 రౌండ్ 6 - 16,254
రౌండ్ 7 - 16,040

## ఏపీ డిజిటల్ అక్షరాస్యత మారాలి :చంద్రబాబు

వివరించారు. తద్వారా మొత్తం వాట్సాప్ గవర్నెన్స్ సేవలు 350కి చేరుతాయని చెప్పారు. భవిష్యత్తులో మొత్తం 500 సేవలను అందుబాటులోకి తేనున్నట్లు ప్రకటించారు. రాబోయే రోజుల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను పెద్ద ఎత్తున వినియోగించి వన్ స్టేట్ వన్ యాప్ విధానాన్ని అమలు చేయనున్నట్లు తెలిపారు. దీనిద్వారా ప్రజలకు అన్ని ప్రభుత్వ సేవలు కేవలం ఒకే ఒక ప్లాట్‌ఫామ్‌లో లభించేలా ఏర్పాట్లు చేస్తున్నామని స్పష్టం చేశారు. ఈ సమీక్ష సమావేశంలో పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ, వ్యవసాయ శాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు, హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత, అటవీ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్, సీఎం కార్యదర్శులు ముద్దాడ రవిచంద్ర, ప్రద్యుమ్న, రాజమౌళి, హోంశాఖ ఐటీ సెల్ ఐజీ శ్రీకాంత్, ఐజీ ఈగల్ ఆర్‌కె రవికృష్ణ, సీఈఓ వి. కరుణ, ఆర్టీజీఎస్ డిప్యూటీ సీఈఓ ఎం. మాధురి తదితరులు పాల్గొన్నారు. ఈ కొత్త విధానాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం పౌరులకు సులభమైన, పారదర్శకమైన పాలన అందించడమే లక్ష్యంగా పెట్టుకుంది. డిజిటల్ అక్షరాస్యత పెంపొందించుకోవడం ద్వారా ప్రజలు ప్రభుత్వ సేవలను మరింత సమర్థంగా వినియోగించుకోగలుగుతారు. ఈ కార్యక్రమం విజయవంతమైతే ఆంధ్రప్రదేశ్ డిజిటల్ మార్గంలో ముందంజ వేస్తుందని, దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఒక మార్గదర్శిగా నిలుస్తుందని సీఎం చంద్రబాబు విశ్వాసం వ్యక్తం చేశారు.

## తల్లికి వందనంపై త్వరలోనే.. గైడ్ లైన్స్

ఉంది. గత వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో ఒక్కసారి కూడా డీఎస్సీ నిర్వహించలేదు. ఒక్క టీచర్ పోస్టునూ భర్తీ చేయలేదు. దీనిపై వైసీపీ సమాధానం చెప్పాలి. ఉపాధ్యాయ నియామకాల్లో 1994 నుంచి చూస్తే.. 2,60,194 పోస్టులు భర్తీ చేశారు. అందులో టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు 1,80,272 పోస్టులు భర్తీ చేయడం జరిగింది. ఒక్క టీడీపీ హయాంలోనే 70 శాతం టీచర్ పోస్టులు భర్తీ చేయడం జరిగింది. నేను మంత్రిగా బాధ్యతలు స్వీకరించినప్పుడు డీఎస్సీ ఫైల్ పైనే మొదటి సంతకం చేశాను. అందులో భాగంగానే 02-07-24 తేదీన టెట్ నిర్వహించడం జరిగింది. 4.27 లక్షల మంది దరఖాస్తు చేసుకోగా 3.68 లక్షల మంది పరీక్షకు హాజరయ్యారు. 1.87 లక్షల మంది అర్హత సాధించారు. 03-10-24 నుంచి 21-10-24 వరకు టెట్ పరీక్షను పూర్తిచేయడం జరిగింది. వర్గీకరణపై వన్ మ్యాన్ కమిషన్ నివేదిక త్వరలోనే రాబోతోందని భావిస్తున్నాం. ఎట్టిపరిస్థితుల్లోనూ మార్చి నెలలో డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చే బాధ్యత కూటమి ప్రభుత్వం తీసుకుంటుందని నిరుద్యోగ యువతీ, యువకులకు ఈ సభ సాక్షిగా హామీ ఇస్తున్నా. ప్రతిపక్ష పార్టీ నేతలు నా శాఖకు సంబంధించి ప్రశ్నలు వేసి.. చర్చించేందుకు సిద్ధంగా లేరని, ఇది చాలా బాధాకరం.

# ఏపీలోనే అత్యంత పేదరిక జిల్లా ఇదీ!

**అమరావతి మార్చి 04 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ఆంధ్రప్రదేశ్‌లోని ఉమ్మడి కర్నూలు జిల్లా అత్యంత పేదరికాన్ని ఎదుర్కొంటున్న జిల్లాగా సోషియో-ఎకనామిక్ సర్వేలో వెల్లడైంది. ఈ సర్వే ప్రకారం జిల్లాలో 42 శాతం మంది ప్రజలు పేదరిక రేఖకు దిగువన జీవిస్తున్నట్లు గుర్తించారు. ఆర్థిక, సామాజిక పరిస్థితుల ప్రభావంతో ఈ జిల్లా రాష్ట్రంలోనే అత్యధిక పేదరికాన్ని ఎదుర్కొంటున్నదని నివేదిక స్పష్టం చేసింది. ప్రభుత్వానికి ఇది ఒక ముఖ్యమైన ఆందోళన కలిగించే అంశంగా మారింది.

-పేదరికానికి ప్రధాన కారణాలు

కర్నూలు జిల్లా వెనుకబాటు వెనుక అనేక కారణాలు ఉన్నట్లు సర్వే చెబుతోంది. ముఖ్యంగా:

అభివృద్ధి అవకాశాల లోపం
ఉపాధి అవకాశాల కొరత
తక్కువ ఆదాయ వనరులు
వ్యవసాయ ఆధారిత జీవన విధానం
పరిశ్రమలు, వాణిజ్య రంగాల అభివృద్ధి తక్కువగా ఉండటం
కారణాల వల్ల జిల్లాలో పేదరిక స్థాయి అధికంగా ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

**పేదరికం తక్కువగా ఉన్న జిల్లాలు**


ఈ సర్వే ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో పశ్చిమగోదావరి జిల్లా అత్యంత తక్కువ పేదరికం ఉన్న ప్రాంతంగా గుర్తింపు పొందింది. ఆ తర్వాత కడప, గుంటూరు, కృష్ణ జిల్లాలు పేదరికం తక్కువగా ఉన్న జిల్లాలుగా నిలిచాయి. అభివృద్ధి, ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో పేదరికం తక్కువగా ఉండటాన్ని పరిశీలకులు విశ్లేషించారు. పరిశ్రమలు, వ్యవసాయం, వ్యాపార అవకాశాలు మెరుగ్గా ఉండే జిల్లాల్లో పేదరికం తక్కువగా ఉండగా, కర్నూలు వంటి వెనుకబడిన జిల్లాల్లో పరిస్థితి భిన్నంగా ఉందని నివేదిక పేర్కొంది.

**ఇతర వెనుకబడిన జిల్లాలు**

కర్నూలుతో పాటు చిత్తూరు, శ్రీకాకుళం, నెల్లూరు, అనంతపురం, తూర్పుగోదావరి, ప్రకాశం, విశాఖపట్నం, విజయనగరం జిల్లాలు కూడా అధిక పేదరిక స్థాయిలో ఉన్నాయని నివేదిక వెల్లడించింది. ముఖ్యంగా గిరిజనులు నివసించే ప్రాంతాల్లో పేదరికం తీవ్రంగా ఉందని పేర్కొంది. అభివృద్ధి అవకాశాల లోపం, ఉపాధి దెబ్బతినడం, తక్కువ ఆదాయ వనరులు ఈ జిల్లాల్లో పేదరికాన్ని పెంచుతున్నాయి.

**ప్రభుత్వ చర్యలు అవసరం**

ఈ నివేదిక రాష్ట్ర ప్రభుత్వాన్ని వెంటనే చర్యలు తీసుకునేలా చేస్తుందని విశ్లేషకులు అంచనా




వేస్తున్నారు. ముఖ్యంగా వెనుకబడిన జిల్లాల్లో "విద్యా ప్రమాణాలను మెరుగుపరచడం, ఆరోగ్య సంరక్షణ సేవలను పెంచడం, ఉపాధి అవకాశాలను అభివృద్ధి చేయడం, సంక్షేమ పథకాలను మరింత సమర్థవంతంగా అమలు చేయడం" వంటి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని మరిన్ని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తేనే పేదరికాన్ని తగ్గించే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

కర్నూలు జిల్లా పేదరిక సమస్య ప్రభుత్వ అధికారుల దృష్టికి రావడం ముఖ్యమైన పరిణామం. అభివృద్ధికి మార్గదర్శకం రూపొందించేందుకు ఇది సరైన సమయం. దీని కోసం ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల కలయిక, ప్రజల భాగస్వామ్యం అవసరం. సక్రమమైన ప్రణాళికలు, అమలులో పకడ్బందీతో పేదరికాన్ని తగ్గించవచ్చు.

# అన్నీ తానై... ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ లో కలెక్టర్ వెట్రిసెల్వి.

**నిరంతరాయంగా ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని పర్యవేక్షించిన కలెక్టర్..**

**పోటీలో 35 మంది అభ్యర్థులు... జంబో బ్యాలెట్ పేపర్..**

**జిల్లా కలెక్టర్ స్వీయ పర్యవేక్షణలో అనుకున్న సమయంకంటే ముందుగానే ప్రశాంతంగా ముగిసిన ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ..**

**ఏలూరు మార్చి 04 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

మార్చ్,ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అన్నీ తానై సమర్థవంతంగా నడిపించారు. ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు కార్యక్రమం ఏలూరులోని సర్. సి.ఆర్.రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం ఉదయం 8 గంటల నుండి ప్రారంభమై, మంగళవారం మధ్యాహ్నం వరకు జరిగింది. బ్యాలెట్ పత్రాల ద్వారా ఎన్నికలు నిర్వహించడంతో బ్యాలెట్ పత్రాలతో ప్రాధాన్యతా ఓట్ల లెక్కింపు అత్యంత క్లిష్టమైనది. పోటీలో 35 మంది అభ్యర్థులు, అంతమంది పేర్లతో కూడిన 'జంబో ' బ్యాలెట్ పేపర్. ఓట్ల లెక్కింపు కార్యక్రమం ప్రారంభం నుండి జిల్లా కలెక్టర్ కౌంటింగ్ సిబ్బందితో ఎక్కడా ఏ పొరపాటు జరగకుండా ఓట్ల లెక్కింపును సునిశితంగా పర్యవేక్షించారు. సోమవారం ఉదయం 6 గంటల నుండి కౌంటింగ్ సిబ్బందిని సమాయత్త పరచడం... స్ట్రాంగ్ రూంల నుండి బ్యాలెట్ బాక్సులను కౌంటింగ్ హాలులోకి సిబ్బంది తీసుకువచ్చిన తరువాత ఏ టేబుల్ కు కేటాయించిన పోలింగ్ స్టేషన్ కు





సంబంధించిన బ్యాలెట్ బాక్స్ అదే టేబుల్ కి వెళ్ళింది, లేనిదీ అని కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. బ్యాలెట్ బాక్సులలో బ్యాలెట్ పత్రాలను లెక్కింపు, డ్రం లో వేయడం... వారిలో చెల్లినవి, చెల్లని ఓట్లను వేరుచేసే కార్యక్రమం, చెల్లిన, చెల్లని ఓట్లను ఏజెంట్లు చూపి, వాటిని లెక్కింపు బాక్సులలో వేసి, ప్రాధాన్యతా ఓట్లను లెక్కించేవరకు అన్ని అంశాలలో ప్రతీ పనిని జిల్లా కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించి, అన్నీ తానై నడిపించారు. ఓట్ల లెక్కింపు కార్యక్రమం ఎక్కువ సమయం పడుతుందని ఊహించినప్పటికీ, జిల్లా కలెక్టర్ చొరవ, అలుపెరుగని పర్యవేక్షణతో ఊహించిన సమయం కంటే ముందుగానే ఓట్ల లెక్కింపు కార్యక్రమం ముగిసింది. వీరికి తోడుగా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి,డి ఆర్ ఓ వి.విశ్వేశ్వర రావు ఎన్నికల నిర్వహణలో సజావుగా ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణలో సమర్థవంతంగా కర్తవ్య బాధ్యత నిర్వహించారు.

అంతే కాకుండా ఎన్నికల మీడియా సెంటర్ లో పాత్రికేయులకు సరైన సదుపాయాలు ఉన్నాయి లేదా అని మీడియా సెల్ సందర్శించి సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు ఇచ్చారు.






ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ కి జర్మనీ పర్యటనకు వెళ్లారు. మంగళవారం బెర్లిన్ నగరంలో ఘన స్వాగతం పలికిన ఎన్ఆర్ఐలు, జనసైనికులు, వీరమహిళలు. - ( తెలుగరాష్ట్ర:ం ప్రతినిధి)

## కూటమి ఎమ్మెల్సీ ఎన్నికల గెలుపు

# ప్రజా విజయం..

## మాజీమంత్రి ప్రత్తిపాటి.



**చిలకలూరుపేట మార్చి 04 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

రాజేంద్రప్రసాద్, రాజశేఖర్ విజయం కూటమిప్రభుత్వంపై ప్రజలకున్న నమ్మకం, విశ్వాసానికి నిదర్శనం. బ్యాలెట్ ఎన్నికల్లోనూ కూటమి అభ్యర్థులు విజయం సాధించడం, పట్టభద్రులు తమ ప్రభుత్వాన్ని ఆదరించడం శుభపరిణామం. కూటమిప్రభుత్వంపై ప్రజలకు ఉన్న నమ్మకం, విశ్వాసం తగ్గలేదని చెప్పడానికి ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపే నిదర్శనం. పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉమ్మడి కృష్ణా-గుంటూరు అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్, రాజశేఖర్ విజయం సాధించడం సంతోషంగా ఉంది. 82వేల పైచిలుకు ఓట్ల మెజారిటీతో ఆలపాటికి పట్టభద్రులు పట్టం కట్టడం.. ప్రభుత్వంపై వారికున్న అచంచల నమ్మకాన్ని తెలియచేస్తోంది. పెద్దల సభలో ఆలపాటి ప్రజాసమస్యల పరిష్కారానికి తగిన కృషి చేస్తాడని నమ్ముతున్నాం. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా కూటమి బలపరిచిన శ్రీనివాసులు నాయుడు విజయం సాధించారు. ఉమ్మడి గోదావరి జిల్లాల పట్టభద్ర అభ్యర్థిగా గెలిచిన రాజశేఖర్ కు అభినందనలు. బ్యాలెట్ ఓటింగ్ లోనూ కూటమి అభ్యర్థులే విజయం సాధించడం, పట్టభద్రులు తమ ప్రభుత్వాన్ని ఎంతగానో ఆదరించడం శుభపరిణామం. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయంలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలియచేస్తున్నాను." అని మాజీమంత్రి ప్రత్తిపాటి ఒక ప్రకటనలో తెలిపారు.

# వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు : జిల్లా కలెక్టర్

**మచిలీపట్నం, మార్చి 04 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**




రానున్న వేసవిలో పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్లోని తన చాంబర్లో జిల్లా కలెక్టర్ గ్రామీణ నీటి సరఫరా, మున్సిపల్, ఇరిగేషన్, ఐసిడిఎస్ తదితర శాఖల అధికారులతో వేసవిలో తాగునీటి సమస్యకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని ప్రజల తాగునీటి అవసరాలను తీర్చేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మచిలీపట్నం, పెడన, గుడివాడ, ఉయ్యూరు, తాడిగడప మున్సిపల్ కమిషనర్లు ప్రత్యేక శ్రద్ధ పెట్టి లీకైన పైప్ లైన్లు, చేతిపంపులకు మరమ్మతులు చేపట్టడం వంటి పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. అవసరమైన పనులకు నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపించాలని సూచించారు. మచిలీపట్నం, పెడన మున్సిపాలిటీలకు తరకుటూరు స్టోరేజ్ నుంచి తాగునీరు సరఫరా అవుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ఏప్రిల్ నెలలో కాలువలకు నీటిని విడుదల చేసినప్పుడు పూర్తిస్థాయిలో నింపాలన్నారు. అదేవిధంగా గ్రామీణ శివారు ప్రాంతాలలోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను పూర్తిస్థాయిలో నింపే విధంగా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైన ప్రాంతాలలో ట్యాంకర్లతో తాగునీటిని అందించాలన్నారు. గుడివాడలోని టిడ్కో గృహ సముదాయాలకు సరఫరా చేస్తున్న నీరు సరిపోవటం లేదని, నీటి వనరులను పెంచాల్సిన అవసరం ఉందని అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, ప్రస్తుతం సమస్య తలెత్తకుండా ఉండేందుకు అదనంగా ట్యాంకర్లతో సరఫరా చేయాలని సూచించారు. ఈ సమావేశంలో గ్రామీణ నీటి సరఫరా విభాగం కార్యనిర్వాహక అధికారి నటరాజన్, ఐసిడిఎస్ పిడి ఎంఎన్ రాణి, సిపిఓ గణేష్ కృష్ణ, మున్సిపల్ కమిషనర్లు, ఇరిగేషన్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పేరాబత్తుల గెలుపు ప్రజా విజయం

**విజయానికి కృషిచేసిన బీజేపీ, జనసేన, టీడీపీ నాయకులకు, కార్యకర్తలకు ధన్యవాదాలు...**

**రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే వేగుళ్ళ...**

**రామచంద్రపురం మార్చి 04 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**



ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల కూటమి పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి గా పోటీచేసిన పేరాబత్తుల రాజశేఖర్ అత్యధిక మెజారిటీతో గెలుపొందటం ముమ్మాటికి ఇది ప్రజా విజయమేనని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, శాసన సభ్యులు వేగుళ్ళ జోగేశ్వరరావు అన్నారు. ఎ.పి అసెంబ్లి సమావేశాలలో ఉన్న ఆయన అమరావతి నుండి మీడియాతో ఫోన్లో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం పై ప్రజలకున్న నమ్మకం, విశ్వాసానికి నిదర్శనం పేరాబత్తుల గెలుపు అని అన్నారు. పట్టభద్రుల నమ్మకాన్ని పేరాబత్తుల నిలబెట్టుకుంటారన్నారు. ప్రజాసమస్యల పరిష్కారానికి ఆయన అంకితభావంతో పనిచేస్తారన్నారు. పేరాబత్తుల గెలుపునకు కృషిచేసిన బీజేపీ, జనసేన, టీడీపీ నాయకులకు, కార్యకర్తలకు పేరుపేరునా ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలియజేశారు.




డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా

తెలుగురాష్ట్రం దినపత్రిక

https://epaper.teluguraastram.com

బుధవారం 05 మార్చి 2025


## ముక్కామల రైతు సేవా కేంద్రంలో విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదుపై అవగాహన



**అంబాజీపేట, మార్చి 04 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

రబి పంట విశిష్ట గుర్తింపును ఈ నెల 6లోగా నమోదు చేసుకోవాలని వ్యవసాయా ధికారి సిహెచ్డి. విజయకుమార్ తెలిపారు. ముక్కామల రైతు సేవా కేంద్రం వద్ద మంగళవారం విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదుపై రైతులకు అవగాహన కల్పించారు. మండల పరిధిలో 6046 మంది రైతులకు గాను, ఇప్పటి వరకూ 4988 మంది రైతులకు నమోదు చేయడమైందన్నారు. పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, వడ్డీ రాయితీ, పంటల బీమా, పెట్టుబడి రాయితీ, యంత్ర పరికరాలు రాయితీలు, గుర్తింపు సంఖ్య నమోదు రైతులకు మాత్రమే వర్తిస్తాయన్నారు. ఆధార్ జిరాక్స్, పట్టాదారు పాస్ బుక్ జిరాక్స్, ఆధార్ కి అనుసంధానమైన ఫోను తీసుకుని నమోదు కానీ రైతులు రైతు సేవా కేంద్రాలలో వ్యవసాయ సహాయకులు ద్వారా చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు వై,ఏసు, ఆకెళ్ళ సోమయాజులు,ఇరుసుమండ ముక్కామల, వక్కలంక, పసుపల్లి రైతులు పాల్గొన్నారు. విఏఏ లు సౌజన్య, నరేంద్ర,కిరణ్ దుర్గ, విహెచ్ఎ లక్ష్మి, ఏఈఓ దుర్గారావు, జాబేజ్ శాస్త్రి, హెచ్ఈఓ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్ట్ నాగ కిషోర్ ని పరామర్శించిన గన్నవరపు శ్రీనివాస్



**అయినవిల్లి మార్చి 04 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

పి. గన్నవరం నియోజకవర్గం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు విత్తనాల నాగ కిషోర్ భార్య లోవ కుమారి గత కొంత కాలంగా మెడ నరాలు సమస్యతో బాధపడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న పి.గన్నవరం నియోజకవర్గ వైసీపీ కో ఆర్డినేటర్, అయినవిల్లి జడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాస్ మంగళవారం సాయంత్రం అయినవిల్లి మండలంలోని సిరిపల్లి లో నివాసముంటున్న విత్తనాల నాగ కిషోర్ సతీమణి లోవ కుమారిని పరామర్శించి అనారోగ్య విషయాలు అడిగి తెలుసుకుని ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు. అయన వెంట సిరిపల్లి సర్పంచ్ కుడిపూడి విద్యాసాగర్(జిజ్జి), పితాని వీరబాబు, తదితరులు ఉన్నారు.

## నన్నయలో ఘనంగా ప్రారంభమైన నారీ వేడుక

**మనిషికి డిగ్రీలు కంటే మానవత విలువలు ముఖ్యం - వీసీ ఆచార్య ఎస్. ప్రసన్నశ్రీ**




**రాజమహేంద్రవరం మార్చి 04 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

మనిషికి ఎన్ని డిగ్రీలు ఉన్న ప్రేమ, అనురాగం, ఆప్యాయత, ఆధరణ వంటి మానవత విలువలు లేకపోతే ఎన్ని డిగ్రీలు ఉన్న వృధా అని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య ఎస్. ప్రసన్నశ్రీ అన్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ కన్వెన్షన్ సెంటర్ లో మంగళవారం నారీ వేడుక పోటీలు ప్రారంభమయ్యాయి. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ హాజరై జ్యోతిప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ, నారీ ఫెస్ట్ కు హాజరైన అందరికీ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. గతంలో ఆడవాళ్ళు ఎన్నో వివక్షతలను ఎదుర్కొనే వారని, నేటి సమాజంలో కొంత మార్పు వచ్చిందని, భవిష్యత్ లో వివక్షత లేని సమాజం వైపు అడుగులు వేయాలన్నారు. ఆకాశం లో సగం, అవకాశంలో సగం మాత్రమే కాదు ఆధరించడంలో కూడా సగం కావాలన్నారు. ఆడవాళ్ళు ఆధరణను కోరుకుంటారని, అటువంటి ఆధరణ తల్లిదండ్రుల నుండి, జీవిత భాగస్వామి నుండి, పిల్లల నుండి, గురువుల నుండి, స్నేహితులు , సన్నిహితుల నుండి లభిస్తుంచన్నారు. మానవ విలువలు పెంపొందించుకోవాలన్నారు. విశ్వవిద్యాలయం మామ్మ , మనవరాలు ఫ్యాషన్ షో నిర్వహిస్తున్నదని, మామ్మ తరం నుండి మనవరాలు తరం వరకు బంధంతో పాటు సంస్కృతి, సాంప్రదాయాలు కొనసాగాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. మామ్మ, మనవరాలు చెయ్యి పట్టుకొని నడుస్తుంటే మామ్మ స్ఫూర్తిని మార్గదర్శకంగా తీసుకున్న మనవరాలు కనిపిస్తుందని అన్నారు. పెద్దవాళ్ళను ఎప్పటికీ గౌరవించాలని, అనాధ ఆశ్రమాలు లేని సమాజం వైపు పయనించాలని సూచించారు. ఈ మూడు రోజుల పోటీలలో అందరూ ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. తరువాత వివిధ కేటగిరీలకు చెందిన మహిళలను, బాలికలను వేదికపైకి పిలిచి బుడగలు వదిలి పోటీలు ప్రారంభించారు. అనంతరం గ్రూప్ సింగింగ్, గ్రూప్ డాన్స్, ఫ్యాషన్ షో, స్కిట్స్, మామ్మ మనవరాలు ఫ్యాషన్ షో, హెల్దీ బేబీ పోటీలు నిర్వహించారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంతో పాటు అనుబంధ కళాశాలలు, స్థానిక మహిళలు ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేశారు. స్థానిక పాఠశాలల విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉమెన్స్ సెల్ కోఆర్డినేటర్ డా.పి.ఉమా మహేశ్వరిదేవి, ప్రెసిడింగ్ ఆఫీసర్ డా.వి.పెర్సిస్, చీఫ్ పెట్రన్ డా.ఎన్.సజనారాజ్, సెక్రటరీ డా.కె.దీప్తి, జాయింట్ సెక్రటరీ డా.డి.లతా, ట్రెజరర్ డా.బి.విజయకుమారి, స్పెషల్ అడ్వైజరీ కమిటీ మెంబర్స్ ఆచార్య డి.జ్యోతిర్మయి, డా.పి.విజయనిర్మల, డా.కె.సుబ్బారావు, డా.కె.నూకరత్నం, డా.పద్మావతి, డా.కె.రమణేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

### ఈనెల 5న వర్సిటీ, అనుబంధ కళాశాలల సిబ్బందికి పోటీలు

ఈనెల 5వ తేదీన ఆదికవి నన్నయ యూనివర్సిటీ , అనుబంధ కళాశాలల మహిళా సిబ్బందికి వివిధ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. సృజనాత్మక చేతిపనులు, చిరుధాన్యాలతో ఆహార పదార్థాలు తయారీ, పూల అలంకరణ వంటి పోటీలు జరుగుతాయన్నారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు రూ.100 రుసుం చెల్లించి స్పాట్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు.

### 6న నారీ వేడుకలు

ఈనెల 6వ తేదీన యూనివర్సిటీ కన్వెన్షన్ సెంటర్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహిస్తామని వీసీ ప్రసన్నశ్రీ తెలియజేశారు. విశ్వవిద్యాలయం నిర్వహించిన వివిధ పోటీలలో విజేతలకు నారీ ఫెస్ట్ కార్యక్రమంలో జ్ఞాపికలను, సర్టిఫికెట్లను అందజేస్తారని అన్నారు. ఈ వేడుకలలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థులు, మహిళలచే ప్రదర్శించబడతాయని చెప్పారు. మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించే కార్యక్రమాలను యూనివర్సిటీ ఉమెన్స్ సెల్ ఆధ్వర్యంలో జరుగుతాయన్నారు. మహిళలందరూ ఈ కార్యక్రమానికి హాజరై నారీ ఫెస్ట్ ను జయప్రదం చేయాలని సూచించారు.

# అక్రమ ఇసుక తవ్వకాలను నిరోధించాలి

- వర్షాకాలం కోసం రూ.25 లక్షల టన్నుల ఇసుక నిల్వ
- పొడగట్లపల్లి రీచ్ విశాఖ జిల్లా అవసరాలకు కేటాయింపు
- జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్



**అమలాపురం, మార్చి 04 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

జిల్లాలో అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణా నిరోధించడానికి ప్రత్యేక తనిఖీలు చేపట్టాలని అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ ఆదేశించారు. సోమవారం అమలాపురం కలెక్టరేట్ లో జిల్లాస్థాయి ఇసుక కమిటీ సభ్యులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోనసీమ జిల్లాలో భవన, రోడ్ల నిర్మాణ రంగాల డిమాండ్ కు తగినంత ఇసుకను సరఫరా చేస్తూనే స్టాక్ పాయింట్లలో వర్షాకాలంలో భవన నిర్మాణాలకు అవసరమైన సుమారు 25 లక్షల టన్నుల ఇసుకను నిల్వ చేయాలని ఆదేశించారు. గోదావరి నదిలో అక్రమంగా ఇసుక త్రవ్వకాలు జరిపి తరలిస్తున్నట్లు ప్రతికూల వార్తలు వస్తున్న నేపథ్యంలో నిఘా వ్యవస్థను మరింత పటిష్టం చేయాలని ఆదేశించారు. సెమీ మెకానైజ్డ్ రీచులలో వారం రోజుల్లో ఇసుక త్రవ్వకాలు ప్రారంభించాలని ఆదేశించారు. ఇసుక తవ్వకాలు కోసం ఐదు రీచులను ప్రతిపాదించి ప్రజాభిప్రాయాన్ని సేకరించడం జరిగిందని వీటికి పర్యావరణ అనుమతులు కోసం కాలుష్య నియంత్రణ మండలి జిల్లా స్థాయి అధికారి కృషి చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం తవ్వకాలు జరుగుతున్న రీచులలో గుర్తించిన ఇసుక నిల్వల కొరకు పూర్తిగా తవ్వకాల నిర్వహించి స్టాక్ పాయింట్లలో నిల్వలు చేయాలని ఆదేశించారు. విశాఖపట్నం జిల్లా యంత్రాంగం జిల్లాలో భవన నిర్మాణాల కోసం ఒక రీచ్ ను కేటాయించాలని కోరిందని ఆ మేరకు రావులపాలెం మండలం పొడగట్లపల్లి ఇసుక రీచును విశాఖపట్నం జిల్లా భవన నిర్మాణ రంగానికి కేటాయించడం జరుగుతుందన్నారు. అక్రమ రవాణాని అరికట్టేందుకు టాస్క్ ఫోర్స్ బృందంలో సభ్యులుగా ఉన్న రవాణా పోలీసు రెవెన్యూ అధికారులు వారానికి కనీసం రెండు సార్లు అక్రమ ఇసుక రవాణాపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. స్థానిక వినియోగదారులు, బల్క్ వినియోగదారులకు ఒక క్రమ పద్ధతిలో ఇసుకను సరఫరా చేయాలని ఎక్కడా ఇసుక సరఫరాలో లోటుపాట్లకు ఆస్కారం లేకుండా కమిటీ సభ్యులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా భూగర్భ గనుల శాఖ అధికారి ఎల్.వంశీధర్ రెడ్డి, జిల్లా రవాణా అధికారి డి.శ్రీనివాసరావు, కాలుష్య నియంత్రణ మండలి కార్యనిర్వాహక ఇంజనీర్ శంకర్రావు, ఆర్డబ్ల్యూఎస్ ఎస్సీ కృష్ణారెడ్డి, డిపిఓ శాంత లక్ష్మి, మత్స్యశాఖ జిల్లా అధికారి ఎన్.శ్రీనివాసరావు, రియాల్టీ ఇన్స్పెక్టర్ సుజాత తదితరులు పాల్గొన్నారు.




# ప్రశాంతంగా ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు

**- జిల్లా రెవెన్యూ అధికారి రాజకుమారి - - ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రం ఆకస్మిక తనిఖీ**



**అమలాపురం, మార్చి 04 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ఇంటర్ బోర్డు వార్షిక పబ్లిక్ పరీక్షలు జిల్లా వ్యాప్తంగా ప్రశాంత వాతావరణంలో జరుగుతున్నాయని జిల్లా రెవెన్యూ అధికారి బి.ఎల్.ఎన్.రాజకుమారి అన్నారు. ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ పబ్లిక్ బోర్డు వార్షిక పరీక్షలు ప్రారంభమైన నేపథ్యంలో మంగళవారం అమలాపురంలోని శ్రీ చైతన్య, నారాయణ జూనియర్ కళాశాలల్లో పరీక్షా కేంద్రాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు పరీక్ష రాసేందుకు చేసిన ఏర్పాట్లు, సౌకర్యాలను పరిశీలించారు. పరీక్షకు హాజరు కాని వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. వేసవి నేపథ్యంలో తాగు నీటికి ఇబ్బంది లేకుండా తీసుకున్న చర్యలతో పాటు వైద్య శిబిరాన్ని పరిశీలించారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లతో పాటు అత్యవసర మందులు అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలతో పాటు భద్రతా ఏర్పాట్లను ఆమె పరిశీలించి పలు సూచనలు చేశారు. చీఫ్ సూపరింటెండెంట్ తో సహా ఇన్విజిలేటర్లు, పరీక్ష విధులకు కేటాయించిన ప్రతిఒక్కరినీ క్షుణ్ణంగా తనిఖీ చేసి మాత్రమే లోపలికి అనుమతించాలన్నారు. అత్యవసర కమ్యూనికేషన్ నిమిత్తం చీఫ్ సూపరింటెండెంట్ కు మాత్రమే కీ ప్యాడ్ మొబైల్ అందుబాటులో ఉంచాలన్నారు. పరీక్ష రాసే విద్యార్థులకు గదుల్లో గాలి, వెలుతురు బాగా ఉండేలా చూసుకోవాలన్నారు. ఇంటర్మీడియట్ విద్య, పాఠశాల విద్య, రెవెన్యూ, పోలీస్, ప్రజా రవాణా, వైద్య ఆరోగ్యం, విద్యుత్, పోస్టల్ తదితర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పరీక్షలు సజావుగా జరిగేలా చూడాలన్నారు. ఈ నెల 1వ తేదీన ప్రారంభమైన ఇంటర్ థియరీ పరీక్షలు మార్చి 20వ తేదీ వరకు జరుగుతాయని, 40 కేంద్రాల్లో 27,312 మంది విద్యార్థినీ విద్యార్థులు హాజరవుతున్నారని అన్నారు. పరీక్షా పత్రాలను స్టోరేజ్ పాయింట్ల నుంచి పరీక్షా కేంద్రాలకు తరలింపు మొదలు ప్రతి దశలోనూ అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ఎలాంటి మాస్ కాపీయింగ్, ఫేక్ న్యూస్ సంఘటనలు చోటు చేసుకోకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలతో పాటు పలు సిటింగ్ స్క్వాడ్లు విధుల్లో పాల్గొంటున్నాయన్నారు .



## ఇంటర్నేషనల్ క్విక్ బాక్సింగ్ పోటీల్లో

# కోనసీమ క్రీడాకారుల ప్రతిభ

**- జిల్లా కలెక్టర్ అభినందనలు**



**అమలాపురం, మార్చి 04 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ఢిల్లీలో ఇటీవల జరిగిన ఇంటర్నేషనల్ క్విక్ బాక్సింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచి మెడల్స్ సాధించిన క్రీడాకారులను జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ అభినందించారు. ఢిల్లీలో జరిగిన ఇంటర్నేషనల్ క్విక్ బాక్సింగ్ పోటీల్లో రామచంద్రపురానికి చెందిన కారుమూరి బాలబాలాజీ, దేవి ప్రియ కుమార్తె లేఖ నిహారిక రెండు గోల్డ్ మెడల్స్, ఒక సిల్వర్ మెడల్ సాధించి వరల్డ్ కప్ పోటీలకు ఎంపికైంది. ప్రస్తుతం ఆమె ఏడో తరగతి చదువుతోంది. అలాగే ద్రాక్షారామంకు చెందిన అల్లం రాజేష్ కుమారుడు ప్రియదర్శిని కార్తీక్ ఒక గోల్డ్ మెడల్, ఒక సిల్వర్ మెడల్ సాధించాడు. ప్రస్తుతం ఆరో తరగతి చదువుతున్నాడు. వీరిరువురిని మంగళవారం అమలాపురం కలెక్టరేట్ లో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల పట్ల మరింత ఆసక్తిని, ప్రతిభను పెంపొందించుకుని ప్రపంచ స్థాయిలో కూడా రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కోచ్ బి.కే.రత్నం, తల్లిదండ్రులు పాల్గొన్నారు.






# వనతారాలో పర్యటన... పులి పిల్లలకు పాలు తాగించిన ప్రధాని మోదీ...


**గుజరాత్ లో 3 వేల ఎకరాల్లో వనతారా వన్యప్రాణి సంరక్షణ కేంద్రం**

**అన్నీ తానై చూసుకుంటున్న అనంత్ అంబానీ**

**నేడు వనతారాలో వింతలు, విశేషాలు తిలకించిన ప్రధాని మోదీ**

రిలయన్స్ అధినేత ముఖేశ్ అంబానీ తనయుడు అనంత్ అంబానీ కలల ప్రతిరూపం... వనతారా కృత్రిమ అభయారణ్యం. ఇక్కడ రకరకాల జంతు జాతులు, పక్షి జాతులు మనుగడ సాగిస్తున్నాయి. ముఖ్యంగా, గాయపడిన, వ్యాధుల బారిన పడిన జంతువులకు, పక్షులకు చికిత్స అందిస్తూ, వాటిని జాగ్రత్తగా కాపాడుతుంటారు. గుజరాత్ లోని జామ్ నగర్ వద్ద ఉన్న 3 వేల ఎకరాల స్థలంలో అనంత్ అంబానీ ఒక అద్భుతమైన అరణ్యాన్ని సృష్టించారు. మొత్తమ్మీద ఇది ఒక వన్యప్రాణి పునరావాస కేంద్రం అని చెప్పవచ్చు. తాజాగా వనతారా అడవిని ప్రధాని నరేంద్ర మోదీ సందర్శించారు. అనంత్ అంబానీ స్వయంగా ప్రధాని వెంట ఉండి... ఈ కృత్రిమ అరణ్యంలోని వింతలు, విశేషాలు వివరించారు. ప్రత్యేక ఎన్ క్లోజర్లలో ఉన్న పులులను, సింహాలను ఆసక్తిగా తిలకించారు. ఏనుగులు, జిరాఫీలు, జీబ్రాలు, హిప్పోలకు ఆహారం అందించారు. పులులు, సింహాల కూనలకు స్వయంగా పాలు తాగించారు. వనతారా సెంటర్ డాక్టర్లు, ఇతర స్టాఫ్ తో ప్రధాని మోదీ ముచ్చటించారు. మోదీ వచ్చే సమయానికి... ఇక్కడి వైద్య కేంద్రంలో ఓ చిరుతకు శస్త్రచికిత్స జరుగుతోంది. మోదీ ఆ శస్త్రచికిత్స జరుగుతున్న తీరును పరిశీలించారు. ఓ ఏనుగుకు ఎంఆర్ఐ స్కానింగ్ జరుగుతుంటే, అక్కడికి కూడా వెళ్లారు. ఇక్కడి వైల్డ్ లైఫ్ రీసెర్చ్ సెంటర్ లోని ల్యాబ్ ను కూడా పరిశీలించారు.




















# సురక్షిత స్థాయిలోనే త్రివేణీ సంగమ జలాలు

## ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి పునరుద్ఘాటన

లఖ్‌నవూ: మహాకుంభమేళా జరిగిన సమయంలో త్రివేణి సంగమ జలాల్లో కాలుష్యం పెచ్చుమీరిందంటూ వచ్చిన వార్తల్ని ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సోమవారం కొట్టిపారేశారు. లఖ్‌నవూలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్, ఇండియన్ పోస్టల్ సర్వీస్ అధికారుల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. "మలినాలున్నాయంటూ వచ్చిన ఆరోపణలు నిరాధారమే అయినప్పటికీ, రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డు, ఇతర స్వతంత్ర ప్రయోగశాలలు జలనాణ్యత పరీక్షలు నిర్వహించి త్రివేణి సంగమ జలాలు సురక్షిత స్థాయిలోనే ఉన్నాయని తేల్చాయి" అని ముఖ్యమంత్రి



పునరుద్ఘాటించారు. మహాకుంభమేళా అతిభారీ స్థాయిలో జరిగిన ఘటన కాబట్టే యునెస్కో తదితర సంస్థలు సంగమ జలాలు సురక్షితమైనవేనా అన్న ప్రశ్న లేవనెత్తాయన్నారు. "125 సంవత్సరాలుగా ఉత్తరప్రదేశ్‌లో అత్యధిక నదీజల కాలుష్యానికి కారణమైన ప్రదేశం కాన్పుర్. అక్కడ నాలుగు కోట్ల లీటర్ల అపరిష్కృత మురుగు జలాలు గంగలో కలిసేవి. మూడేళ్ల క్రితమే మేం నదిలోకి మురుగునీటి విడుదల నిలిపేశాం. ఇప్పుడక్కడ ఒక్క చుక్క మురుగు కూడా నదిలో కలవదు" అని ఆదిత్యనాథ్ అన్నారు.

# మహిళల రక్షణ కోసం 'శక్తి' యాప్

**మండలిలో ప్రకటించిన మంత్రి అనిత**

**అమరావతి మార్చి 04(తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

మహిళలపై లైంగిక వేధింపులు అరికట్టేందుకు, పని ప్రదేశాలలో వారికి రక్షణ కల్పించేందుకు కొత్తగా 'శక్తి' యాప్‌ను తీసుకొస్తున్నామని ఏపీ హోంశాఖ మంత్రి అనిత తెలిపారు. మహిళా దినోత్సవం రోజున ఈ యాప్‌ను సీఎం చంద్రబాబు ప్రారంభించ బోతున్నారని వెల్లడించారు. మహిళలపై లైంగిక వేధింపులు, దిశ చట్టంపై శాసనమండలిలో వైకాపా ఎమ్మెల్సీ వరుదు కల్యాణి అడిగిన ప్రశ్నకు ఆమె సమాధానమిచ్చారు. గత ప్రభుత్వం దిశ చట్టానికి చట్టబద్ధత కల్పించిందో లేదో గుండెలపై చేయి వేసుకొని చెప్పాలని అనిత నిలదీశారు.



# గోదావరిలో బోటు బోల్తా

**బ్రిడ్జిలంకల్లోకి వెళుతుండగా ఘటన**
**ఇద్దరు మృతి**
**10 మంది సురక్షితం**



రాజమహేంద్రవరం మార్చి 04 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

స్థానిక పుష్కర ఘాట్ వద్దనున్న హేవ్ లాక్ వంతెన వద్ద గోదావరిలో బోటు బోల్తా పడిన ఘటనలో ఇద్దరు మృతిచెందారు. ఈ ప్రమాదం నుంచి పది మంది సురక్షితంగా బయటపడ్డారు. సోమవారం మధ్యాహ్నం గోదావరి మధ్యలో సేద తీరేందుకు 23 మంది పుష్కర ఘాట్ నుంచి బోట్లో బయలుదేరి బ్రిడ్జి లంకకు వెళ్లారు. తిరిగి రాత్రి ఏడు గంటల సమయంలో అక్కడి నుంచి 12 మందిని పుష్కరఘాటుకు తీసుకువచ్చి దించేశారు. మరలా బ్రిడ్జిలంక వెళ్లి మిగిలిన 11 మందిని బోట్‌పై తీసుకొస్తుండగా, హేవ్లాక్ వంతెన 8వ నంబర్ పిల్లర్ను బోటు ఢీకొంది. బోటు పాక్షికంగా ధ్వంసమై, నీరు చేరడంతో నదిలో బోల్తాపడిరది. స్థానిక మత్స్యకారులు బోటు నడిపే వ్యక్తితో పాటు, పది మందిని సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. రాజమండ్రి సింహాచలనగర్కు చెందిన ఇస్త్రీ పని చేసే చవల అన్నవరం (52), కాతేరుకు చెందిన ఏసీ మెకానిక్ గాడ రాజు(23) గల్లంతయ్యారు. స్థానికులు ఈ విషయాన్ని త్రీటౌన్ పోలీసులకు సమా చారం ఇవ్వడంతో, సెంట్రల్ జోన్ డీఎస్పీ రమేష్‌బాబు ఆధ్వర్యంలో ఎస్సైలు, సిబ్బంది, జిల్లా అగ్ని మాపకాధికారి లూథర్ కింగ్, సహాయ అగ్నిమాపకాధికారి శ్రీనివాసరావు, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, తమ సిబ్బందితో పుష్కరాలరేవుకు చేరుకున్నారు. గల్లంత్కైన వారి కోసం ముమ్మర గాలింపు చేపట్టారు. మత్స్య శాఖ అధికారులతో చర్చించి, పడవలను రప్పించి, అగ్నిమాపక సిబ్బంది, మత్స్య కారులు సంఘటన ప్రాంతంలో గాలింపు చర్యలు చేపట్టారు. విషయం తెలుసుకున్న జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు, అడిషనల్ ఎస్పీ సుబ్బరాజు పుష్కరా లరేవుకు చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షిం చారు. ముమ్మర గాలింపు అనంతరం అన్నవరం, రాజు మృతదేహాలు లభ్యమయ్యాయి. మద్యం సేవించడానికి, జూదం అడటానికి బ్రిడ్జిలంకలోకి వెళుతున్నట్లు తెలుస్తుంది.

# ప్రజల ప్రాణాల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యం

- గోదావరిలో రాకపోకలపై నియంత్రణ ఎక్కడ?
- రాత్రివేళ బ్రిడ్జి లంకకు వెళ్లడంలో ఆంతర్యం ఏమిటి
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మార్చేశారా ?
- పడవ బోల్తా ఘటనలో ఇద్దరు మృతి బాధాకరం
- బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలంతి
- తక్షణం కంట్రోలు రూమ్ ఏర్పాటుచేయాలి
- మృతుల కుటుంబాలకు ఎక్స్ గ్రేషియా ప్రకటించాలి
- పుష్కర్ ఘాట్ పరిశీలించిన మాజీ ఎంపీ భరత్ రామ్



రాజమహేంద్రవరం మార్చి 04 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ప్రజల ప్రాణాలంటే కూటమి ప్రభుత్వానికి లెక్కలేదని వైయస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎంపీ మార్గాని భరత్ విమర్శించారు. స్థానిక పుష్కరాల రేవు సమీపంలో గోదావరిలో పడవ బోల్తా పడిన ఘటనలో ఇద్దరు ప్రాణాలు కోల్పోవడం పట్ల ఆయన విచారం వ్యక్తంచేసారు. మంగళవారం ఉదయం పుష్కర్ ఘాట్‌ని ఆయన పరిశీలించారు. అనంతరం భరత్ రామ్ మాట్లాడుతూ కోటిలింగాల ఘాట్ నుంచి తరచూ జనాలు బోట్ల మీద బ్రిడ్జి లంకకు వెళ్తున్నట్లు తెలుస్తోందన్నారు. అసలు ఇలా ఎందుకు వెళుతున్నారో పర్యవేక్షణ ఏమైనా ఉందా అని ప్రశ్నించారు. పైగా రాత్రి వేళ బ్రిడ్జి లంకకు వెళ్లాల్సిన అవసరం ఏముందన్నారు. పేకాట కోసమా, పార్టీలు చేసుకోడానికా, మరి దేనికోసం వెళ్తున్నారో అర్ధంకాని పరిస్థితి నెలకొందని వాపోయారు. గతంలో ఇదే పుష్కరాల రేవులో ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా 29మంది ప్రాణాలు కోల్పోయారని మార్గాని భరత్ రామ్ గుర్తుచేసారు. మళ్ళీ పుష్కరాలు రాబోతున్నాయని, అటువంటి పరిస్థితిల్లో ప్రభుత్వం ఏమి చర్యలు తీసుకుంటోందని ఆయన నిలదీశారు. ఒకపక్క లంకలోని రెస్టారెంట్ దగ్గరకు టూరిజం బోటులో జనం వెళుతున్నారని, అలాంటప్పుడు రెస్క్యూ ఆపరేషన్ ఏమైనా చేస్తున్నారా అని భరత్ రామ్ ప్రశ్నించారు. అక్కడ ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యులని ప్రశ్నించారు. ప్రమాదం నిన్న రాత్రి 7గంటలకు జరిగితే, నగర నడిబొడ్డులో ఘటన జరిగితే రెస్క్యూ ఆపరేషన్ టీమ్ రాత్రి 11గంటల ప్రాంతానికి వచ్చారంటే ఎంత అన్యాయం అని ఆయన ఆశ్చర్యం వ్యక్తంచేసారు. ఎందుకంటే 12మంది బోటులో వెళ్తే, పదిమందికి ఈత రావడం వలన బయట పడినట్లు చెబుతున్నారని మిగిలిన ఇద్దరు ఈతరాక పోవడం వలన ప్రాణాలు కోల్పోయారని అంటున్నారని భరత్ పేర్కొన్నారు. ఇలాంటి ప్రమాదకర పరిస్థితులు జరుగుతుంటే అసలు ఏమిచేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. ఇది ప్రభుత్వ వైఫల్యంగా భరత్ పేర్కొన్నారు. ఏడాదిన్నరలో పుష్కరాలు జరుగబోతున్న సమయంలో ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపడుతోందని ఆయన ప్రశ్నించారు. గతంలో వైసిపి ప్రభుత్వంలో శంకర మఠం ఎదురుగా కంట్రోలు రూమ్ ఏర్పాటుచేయించి, పాపికొండలు టూర్‌కి సంబంధించి పర్యవేక్షణ చేయించామని గుర్తుచేశారు. కనీసం దాన్ని 24గంటలూ పనిచేసేలా చూడాలి కదా అని ఆయన నిలదీశారు. పర్యవేక్షణ జరగడం లేదంటే ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉందని అర్ధం అవుతోందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం బుద్ధి తెచ్చుకుని కంట్రోలు రూము ఏర్పాటుచేయాలని డిమాండ్ చేసారు. వైసిపి ప్రభుత్వ హయాంలో ఇలాంటి దురదృష్టకర ఘటనలు జరిగితే, 20లక్షలు, 25లక్షలు చొప్పున ఎక్స్ గ్రేషియా ప్రకటించేదని ఆయన పేర్కొన్నారు. చంద్రబాబు తక్షణం స్పందించి మృతుల కుటుంబాలకు ఎక్స్ గ్రేషియా ప్రకటించి, ఆ కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేసారు. అలాగే బాధ్యులపై తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేసారు. ముఖ్యంగా కోటిలింగాల రేవులో ఎమ్మెల్యే మనుషులు ఇసుక ర్యాంపులు నడుస్తున్నాయని, 12,13సొసైటీలు రోజూ యథేచ్ఛగా బోట్లమీద బోట్లు పనిచేస్తున్నాయని, కొన్ని వందల లారీల్లో ఇసుక తరలిస్తున్నారని పేర్కొన్నారు. వైసిపి హయాంలో ఇలా లేదన్నారు. కనీసం బోట్లమీద ఇసుక కోసం వెళ్లేవారు కూడా పడవ ప్రమాదంపై స్పందించలేదని ఆయన వాపోయారు. వీళ్ళు స్పందించి ఉంటేట, ఆ ఇద్దరి ప్రాణాలు దక్కేవని, డబ్బులు దోచేయడంలో ఉన్న శ్రద్ధ ప్రజలను కాపాడడంలో లేదని ఆయన మండిపడ్డారు. మహాశివరాత్రి రోజున తాడిపూడిలో ఆరుగురు యువకులు చనిపోవడంతో పాటు తరచూ ప్రమాదాలు జరుగుతున్నందున కార్యాచరణతో చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని భరత్ డిమాండ్ చేసారు.

### గౌతమీ సూపర్ బజార్ వ్యవహారం నిగ్గు తేల్చాలి

గౌతమీ సూపర్ బజార్‌కి చెందిన స్థలం లీజు విషయంలో తనకు ఐదుకోట్ల రూపాయలు లంచం ఇచ్చినట్లు ఆరోపించిన ఈవీఎం ఎమ్మెల్యే ఇప్పుడు అక్కడ నిర్మాణాలు జరుగుతుంటే ఏమిచేస్తున్నట్టు అని భరత్ ప్రశ్నించారు. ఎందుకు ఆపడంలేదని ఆయన నిలదీశారు. మరి ఈవీఎం ఎమ్మెల్యేకు డబ్బులు ముట్టాయేమో అని ఆయన అనుమానం వ్యక్తంచేసారు. అన్యాయంగా అక్రమంగా లీజుకి ఇచ్చారని మీరే చెప్పి, ఇప్పుడు నిర్మాణం జరుగుతుంటే ఆపకుండా ఎందుకు తాత్సారం చేస్తున్నారని నిలదీశారు. తమకు అంటుకున్న బురదను ఎదుటివారిపైన జల్లేయడం అంటే ఇదేనని ఆయన వాపోయారు. సూపర్ బజార్ స్థలాన్ని పరిరక్షించే చర్యలు చేపట్టి, నిర్మాణం ఆపాలని, లేకుంటే తాము అక్కడ ధర్నా చేస్తామని ఆయన ప్రకటించారు. నిజం నిగ్గు తేలాలని అన్నారు.

# చెడు వ్యసనాలతో ప్రాణాలు పోగొట్టుకోవద్దు

**గోదావరి లంకల్లోకి మద్యం,జూదం కోసం పడవలపై వెళ్ళకండి**
**మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే శ్రీనివాస్ ప్రగాఢ సంతాపం**



రాజమహేంద్రవరం మార్చి 04 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

గోదావరి లంకల్లోకి మద్యం, జూదం, ఇతరత్ర కార్యక్రమాల (కోడిపందాలు) కోసం పడవలపై వెళ్ళి ప్రాణాలు పోగొట్టుకోవద్దని రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్(వాసు) కోరారు. గోదావరిలో సోమవారం రాత్రి బోటు బోల్తాపడి మృతి చెందిన ఇరువురి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ప్రగాఢ సంతాపం తెలిపారు. ఒకరు రాజమండ్రి రూరల్ పరిధిలోని మిలట్రీ కాలనీకి చెందిన వారని, మరోకరు రాజమండ్రి సిటీ నియోజకవర్గం పరిధిలోని సింహాచలనగర్‌కు చెందిన వారని పేర్కొన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో విజయవాడలో ఉండడం వల్ల వెంటనే రాలేక పోతున్నానని, తమ పార్టీ నాయకులు మృతుల కుటుంబాలకు అన్ని విధాలా సహకారం అందించే ఏర్పాట్లు చేశామని చెప్పారు. జరిగిన సంఘటన పట్ల ఆయన తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అయితే వారు బోటులో గోదావరి లంకల్లోకి వెళ్ళిన పరిస్థితుల పట్ల ఆయన విచారం వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా సోమవారం డ్రై డే అని ఎక్కడా మద్యం అమ్మకాలు జరగకుండా అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారని తెలిపారు. దీంతో కొందరు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారని, చెడు వ్యసనాలకు అలవాటుపడిన కొందరు, రాజమండ్రి పరిసర ప్రాంతాల నుంచి, కొవ్వూరు నుంచి హేవలాక్ వంతెన సమీపంలోని గోదావరి బ్రిడ్జిలంక వద్దకు మద్యం, ఇతరత్రా కార్యక్రమాల (కోడిపందాలు) కోసం గోదావరి లంకల్లోకి వెళ్ళడం వల్ల ఈ ప్రమాదం జరిగి ప్రాణాలు పోగొట్టుకున్నారని వివరించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక నగరాలు గ్రామాల్లో జూదం తదితర చెడు వ్యసనాలు జరగకుండా పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారని తెలిపారు. మీ వ్యసనాలతో ప్రాణాలు పోగొట్టుకుంటే మీ కుటుంబాలను రోడ్డున పడేసినట్టే కదా అని ఎమ్మెల్యే శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. గోదావరి లంకల్లో జూదం ఆడిరచడానికి కారణమైన మల్లయ్య పేటకు చెందిన ముగ్గురిని పోలీసులు గుర్తించి కేసు నమోదు చేశారని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తున్నామన్నారు. గతంలో ఐదు సంవత్సరాల మాదిరి ఇప్పుడు కూడా ఉండాలనుకుంటే కుదరదని వాసు స్పష్టం చేశారు. రాజమండ్రి సిటీ, రూరల్ పరిధిలో కాని ఎక్కడా వారి ఆటలు సాగడంలేదని కొందరు ఇలా నగరానికి దూరంగా గోదావరి లంకలను ఎంచుకుని మద్యం, జూదం, ఇతరత్రా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని వాసు తెలిపారు. దీనిపై ఎస్పీతోను, సంబంధిత పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్‌లతోను మాట్లాడానని ఇలాంటి వారిపై కఠినంగా వ్యవహరించాలని సూచించామన్నారు. ఇకనైనా చెడు వ్యసనాలకు అలవాటుపడిన వారు మారాలన్నారు. జూదం, ఇతరత్రా వ్యసనాలకు దూరంగా ఉండాలని హితవు పలికారు.

## ఇది ప్రజా విజయం : పట్టభద్రుల మద్దతు కూటమికే : గన్ని



రాజమహేంద్రవరం మార్చి 04 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఉభయ గోదావరి, గుంటూరు- కృష్ణ జిల్లాల పట్టభద్రుల ఎన్నికలలో కూటమికి చెందిన పేరాబత్తుల రాజశేఖరం, ఆలపాటి రాజా అత్యధిక మెజారిటీతో గెలుపొందడం ముమ్మాటికి ప్రజా విజయమని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ అన్నారు. ఎనిమిది నెలల కూటమి ప్రభుత్వాన్ని పట్టభద్రులు విశ్వసించి ఎమ్మెల్సీ ఎన్నికలలో మళ్ళీ పట్టం కట్టారని అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలలో కూటమి విజయం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ రెండు స్థానాలలో పట్టభద్రులు భారీ విజయం అందించారని అన్నారు. విజయం సాధించిన పేరాబత్తుల రాజశేఖర్, ఆలపాటి రాజాలకు గన్ని అభినందనలు తెలిపారు. ఈ ఎన్నికలలో చదువుకున్న వారు విజ్ఞతతో ఓటు వేశారని, కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమానికి మద్దతు తెలిపారని అన్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు స్వీకరించిన నాటి నుండి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పరిశ్రమలు, పెట్టుబడులు తెచ్చి నిరుద్యోగులకు ఉపాధి కల్పించడం కోసం ఆయన పడుతున్న శ్రమను పట్టభద్రులు విశ్వసిస్తున్నారనడానికి ఈ ఎన్నికల ఫలితాలే నిదర్శనమన్నారు. ఈ ఎన్నికలలో కూటమి అభ్యర్ధులను ఓడిరచడానికి వైసిపి చేసిన కుట్ర రాజకీయాలను పట్టభద్రులు తిప్పికొట్టారని అన్నారు. కూటమి అభ్యర్ధుల విజయానికి అహర్నిశలు శ్రమించిన కూటమి కార్యకర్తలు, ఇన్చార్జ్‌లు, నియోజకవర్గ పరిశీలకులు, కూటమి నాయకులకు గన్ని అభినందనలు తెలియజేశారు.

## ప్రభుత్వంపై ఉన్న నమ్మకమే పేరాబత్తుల విజయానికి నిదర్శనం



కడియం మార్చి 04 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

కూటమి ప్రభుత్వం పై ప్రజలకు ఉన్న నమ్మకానికి ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ ఘన విజయానికి నిదర్శనమని కడియం మండల టిడిపి అధ్యక్షులు వెలుగుబంటి రఘురామ్ తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల పాలనపై ప్రజల్లో నమ్మకం పెరుగుతుందన్నారు. అందుకునే ఎమ్మెల్సీ ఎన్నికలలో కూటమి అభ్యర్థులు రాష్ట్ర వ్యాప్తంగా విజయ ఢంకా మోగించారన్నారు.ఈ విజయానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా నాని కృతజ్ఞతలు తెలిపారు.

## ఘనంగా అన్నసమారాధన కార్యక్రమం..

**అన్నసమారాధనకు కంబాల శ్రీనివాసరావు రెండు లక్షల రూపాయలు విరాళం..**



గోకవరం మార్చి 04 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

గోకవరం ప్రధాన రహదారిలో ఉన్న శ్రీ రమా సత్యనారాయణ స్వామి వారి ఆలయం వద్ద మహాశివరాత్రి మహెూత్సవాలు పురస్కరించుకొని, మంగళవారం నిర్వహించిన, భారీ అన్నసమారాధన కార్యక్రమం ఘనంగా జరిగింది. గోకవరంతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చి, తీర్థ ప్రసాదరావు స్వీకరించారు. ఈ అన్న సమారాధన కార్యక్రమంలో విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షులు, బీజేపీ నాయకులు కంబాల శ్రీనివాసరావు పాల్గొని, భక్తులకు అన్నప్రసాదాలు వడ్డించారు. అన్న సమారాధనకు (2,00,000) రెండు లక్షల రూపాయలు విరాళాన్ని కంబాల శ్రీనివాసరావు అందించారు. ఈ సందర్భంగా కంబాల శ్రీనివాసరావు మాట్లాడుతూ రమా సత్యనారాయణ స్వామి ఆలయ పునః నిర్మాణానికి గతంలో 45, లక్షలు రూపాయలు విరాళం అందించడం జరిగిందన్నారు. గోకవరం గ్రామాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నానన్నారు. జగ్గంపేట, రాజానగరం, రంపచోడవరం మూడు నియోజకవర్గాలలోని ప్రజల కోసం రాత్రి, పగలు కష్టపడుతూ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నమన్నారు. రాబోయే కాలంలో మరింతగా ప్రజలు ఎటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తే వారి అభివృద్ధి చెందుతారో ఆయా కార్యక్రమాలు నిర్వహించడానికి, ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. ఆలయాల అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి ఎల్లప్పుడు పాటుపడుతుంటానని, అన్నారు. ఈ కార్యక్రమంలో దాసరి తమ్మన్న దొర, రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు మామిడి అయ్యప్ప, బీజేపీ మండల అధ్యక్షులు ఇనకోటి బాపన్న దొర, వరసాల ప్రసాద్, డాక్టర్ వల్లూరి జగన్నాథరావు శర్మ, కట్టా కళ్యాణ్, దాసరి ధర్మరాజు, బత్తుల నానాజీ, నరేష్, గణేష్, చిన్నబాబు, సన్యాసిరావు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పేరాబత్తుల విజయం కూటమికి మద్దతు



కాకినాడ రూరల్ 04 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గానికి కూటమి అభ్యర్థిగా పోటీ చేసిన పేరాబత్తుల రాజశేఖర్ భారీ విజయం దిశగా అడుగులు వేయడం కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమానికి ప్రజల మద్దతు అని మాజీ సర్పంచ్ అడబాల రత్న ప్రసాద్ పేర్కొన్నారు. రమణయ్యపేటలో పేరాబత్తుల రాజశేఖర్ ఎమ్మెల్సీగా భారీ విజయం దిశగా అడుగులు వేస్తున్న సందర్భాన్ని పురస్కరించుకుని మిఠాయిలు పంపిణీ చేశారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల అనంతరం జరిగిన తొలి ఎన్నికలు కావడంతో విద్యావంతులు కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమానికి మద్దతుగా నిలవడం అభినందనీయమని అన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎన్నికబోతున్న పేరాబత్తుల రాజశేఖర్ కు ఆయన విజయానికి కృషి చేసిన స్థానిక శాసనసభ్యులు పంతం నానాజీ కి అడబాల శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బుద్ధరాజు సత్యనారాయణ రాజు, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, పార్ధసారథి, ప్రసాద్ నాయుడు, ఎస్. శ్రీ నగేష్ పాల్గొన్నారు.

## శ్రీ అభయాంజనేయస్వామి ఆలయంలో విశేష పూజలు

## పులిహోర ప్రసాద వితరణ



రాజమహేంద్రవరం రూరల్ 04 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

స్థానిక శివజ్యోతి థియేటర్ చైతన్య టాక్సీ స్టాండ్ వద్ద ఉన్న శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం ఆలయ పురోహితులు లక్ష్మణరావు శర్మ, కుమారుడు పవన్ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు.స్వామివారికి తమలపాకులతో విశేష పూజలు,అభిషేకం తదితర పూజలు చేశారు. ప్రతి మంగళవారం శ్రీ అభయాంజనేయస్వామి ఆలయంలో స్వామివారికి విశేషపూజలు అభిషేకాలు చేస్తుండడంతో భక్తులు,నగర ప్రముఖులు పెద్ద సంఖ్యలో విచ్చేసి దర్శనం చేసుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరిస్తున్నారు.ఈ సందర్భంగా కవిత క్యాంటిన్ చంద్రప్రకాష్ చే భక్తులకు పులిహెూర ప్రసాద వితరణ జరిగింది.కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎం.కృష్ణమాచార్యులు,వీరపండు, వెంకటరమణ వీరభద్రరావు,ఆనంద్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.





# అలాగైతే మోడలింగ్ పోటీలకు వెళ్లండి

## 'రోహిత్ ఊబకాయం' వ్యాఖ్యలపై గావస్కర్ చురకలు

**భారత క్రికెట్ జట్టు కెప్టెన్ రోహిత్ శర్మ ఊబకాయంపై కాంగ్రెస్ నేత షమా మొహమ్మద్ చేసిన పోస్టు పెద్ద దుమారమే రేపింది. కేంద్రంలోని అధికార భాజపా దీనిపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది. కాంగ్రెస్ పార్టీ కూడా ఆమెను మందలించింది. షమా మొహమ్మద్ చేసిన వ్యాఖ్యలతో పార్టీకి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేసింది. సర్వత్రా వ్యతిరేకత రావడంతో షమా తన సోషల్ మీడియా ఖాతా నుంచి ఆ పోస్టును తొలగించారు. అయితే, భారత క్రికెటర్లు సరిగ్గా ఆడకపోతే సద్విమర్శలు చేసే సునీల్ గావస్కర్ ఈ విషయంలో రోహిత్‌కు మద్దతు ఇస్తూ కీలక వ్యాఖ్యలు చేశాడు. క్రికెట్‌కు నాజూకైన ఆకృతి ఒక్కటే అవసరం లేదని, నాణ్యమైన ఆటతీరు కావాలన్నాడు. స్లిమ్‌గా ఉండేవాళ్లే కావాలనుకుంటే ఫ్యాషన్ షోలకు వెళ్లాలని విమర్శకులకు చురకలు అంటించాడు.**



### కోల్‌కతా కెప్టెన్‌గా రహానె

"బ్యాటింగ్ చేయడం ముఖ్యం. క్రికెట్‌లో పరుగులు చేయడమే కీలకం. ఇతర అంశాలన్నీ తర్వాతే. నేను రన్నింగ్ రేస్‌లో రెండు రౌండ్లు కూడా పరిగెత్తలేను. అదే క్రీజ్‌లో పాతుకుపోయి బ్యాటింగ్ చేయమంటే రోజంతా ఆడతా. గతంలోనే నేనో మాట చెప్పా. మీకు నాజూగ్గా ఉండేవాళ్లే కావాలనుకుంటే మీరు (విమర్శకులను ఉద్దేశించి) మోడలింగ్ పోటీలకు వెళ్లండి. అక్కడ మీకు కావాల్సిన మోడల్స్‌ను ఎంపిక చేసుకోండి. అంతేకానీ, క్రికెట్‌లో ఇలాంటి విషయాలకు చోటే లేదు. ఆటను ఎంత బాగా ఆడగలరనేదే ముఖ్యం. గతంలో సర్ఫరాజ్ ఖాన్ గురించి కూడా ఇలాంటి వ్యాఖ్యలే వచ్చాయి. చాలాసార్లు కొందరితో మాటలు పడ్డాడు. కానీ, ఓ టెస్టులో భారత్ తరఫున 150ం పరుగుల ఇన్నింగ్స్‌ను ఆడాడు. వరుసగా హాఫ్ సెంచరీలూ బాదాడు. ఇక అతడితో సమస్య ఏముంటుంది? క్రికెట్‌లో బాడీ సైజ్‌తో అవసరం లేదని భావిస్తా. ఇక్కడ మానసికంగా ఎంత బలంగా ఉన్నామనేది ముఖ్యం" అని గావస్కర్ తెలిపాడు.

### గౌరవం ఇవ్వలేరా?: వెంకటేశ్ ప్రసాద్

భారత జట్టు సారథి రోహిత్ శర్మకు మాజీ క్రికెటర్ వెంకటేశ్ ప్రసాద్ మద్దతుగా నిలిచాడు. "కెప్టెన్‌గా రోహిత్ శర్మ ఎనిమిది నెలల కిందట టీ20 ప్రపంచ కప్ అందించిన సారథి. అలాంటి క్రికెటర్‌పై ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ మధ్యలో వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదు. బాడీ షేమింగ్ చేయడం దారుణం. ఇప్పటివరకు అతడు సాధించిన దానికైనా గౌరవం ఇవ్వాలి" అని వెంకటేశ్ ప్రసాద్ పోస్టు పెట్టాడు.

# సెమీస్‌లో భారత్ ఫేవరేటే కానీ.. రికీ పాంటింగ్



**ఛాంపియన్స్ ట్రోఫీ సెమీస్‌లో భారత్ జట్టును ఫేవరెట్‌గానే తాను పరిగణిస్తున్నానని ఆస్ట్రేలియా మాజీ ఆటగాడు రికీ పాటింగ్ పేర్కొన్నాడు. ఐసీసీ రివ్యూలో భాగంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. కానీ, కీలకమైన మ్యాచ్‌ల్లో ఆసీస్‌ను ఏమాత్రం తక్కువ అంచనా వేయలేమన్నారు. ఈ కార్యక్రమంలో పాంటింగ్ మాట్లాడుతూ.. "ఈ గేమ్‌ను భారత్ ఫేవరెట్‌గానే మొదలుపెట్టనుంది. ఎందుకంటే వారు ఎక్కడికీ ప్రయాణించలేదు. ఈ వికెట్ పైనే సాధన చేశారు. కానీ, ఆస్ట్రేలియా మాత్రం హడావుడిగా దుబాయ్ చేరుకొంది.**

ఇక వన్డే ప్రపంచకప్ ఓటమిని ఆ రోజు రాత్రే అక్కడ డ్రెసింగ్స్ రూమ్‌లోనే టీమ్‌ఇండియా వదిలేసి ఉంటుందని ఆశిస్తున్నా. వారు అనుభవం సంపాదించారు. ఇప్పుడు మరో కోచ్ వచ్చారు. వారు ఆ ఓటమి గురించి కనీసం మాట్లాడుకొని కూడా ఉండరు. ఒకవేళ మాట్లాడుకొన్నా.. వారిలో అది గెలవాలనే మరింత తపనను రగిలిస్తుంది. పరిస్థితులు ఎలాఉన్నా.. ఆటను కొనసాగిస్తూ.. తగినట్లు గేర్లు మార్చడం తెలుసుకొన్నారు. శ్రేయస్, అక్షర్ అద్భుతమైన పాత్ర పోషించారు. జట్టు ఇబ్బందుల్లో ఉన్నప్పుడు నాణ్యమైన ఆటను ఆడారు. వారు అత్యంత నాణ్యమైన ఆటగాళ్లు.

రోహిత్, కోహ్లి విఫలమైనా అక్కడ అయ్యర్, పటేల్, రాహుల్, హార్దిక్ ఉండనే ఉన్నారు. కీలక సమయాల్లో వారి పాత్రను వారు పోషించడంలో దిట్టలు. దీనికితోడు ఇక్కడి వాతావరణ పరిస్థితులు ఇప్పటికే అలవాటు పడటం భారత్‌కు కలిసొస్తుంది. ఈ మ్యాచ్‌లో భారత్ ఫేవరెట్‌గా ఉన్నా.. నేను ఆసీస్‌ను తక్కువ అంచనా వేయను. ఇలాంటి సమయాల్లోనే ఆ ఆటగాళ్లు తమ పూర్తిశక్తిని ధారపోసి ఆడతారు. 'డ్యూ' లేకపోతే టాస్ ఎవరు గెలిచినా.. పెద్దగా తేడా ఉండదు. అందుకే గెలిచినవారు తొలుత బ్యాటింగ్ ఎంచుకోవడం బెటర్. ఎందుకంటే తర్వాత వికెట్ కొంత మందగిస్తుంది. ఛేజింగ్‌తో పోలిస్తే.. ఆసీస్ టాస్ గెలిచి బ్యాటింగ్ తీసుకొంటే విజయావకాశాలు మెరుగ్గా ఉంటాయి" అని విశ్లేషించాడు. ఇక వన్డే ప్రపంచకప్ ఫైనల్‌కు ప్రతీకారం తీర్చుకొని లెక్క సరిచేయాలని భారత్ తపనతో ఉంది. ఆసీస్ ప్రధాన పేస్ దళం గాయాలబారిన పడి జట్టుకు దూరం కావడం టీమ్ ఇండియాకు కలిసొచ్చే అంశం. కానీ, భారత్ వైపు బుమ్రా లేకపోవడం లోపమే అయినా.. స్పిన్ దళం జట్టును ముందుండి నడిపించడం సానుకూలాంశంగా మారింది.

# వరుణ్ ఉండాల్సిందే..

## నలుగురితో బరిలోకి దిగాల్సిందే: అనిల్ కుంబ్లే

**న్యూజిలాండ్‌పై నలుగురు స్పిన్నర్లతో ఆడిన భారత్ అద్భుత విజయం సాధించింది. ఇప్పుడు ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ సెమీస్‌లోనూ అదే ఫార్ములాను ప్రయోగించాలని మాజీ క్రికెటర్లు సూచనలు చేస్తున్నారు. దుబాయ్ పిచ్ స్పిన్‌కు సహకరిస్తున్నందున ఇలాంటి నిర్ణయం సరైందిగా ఉంటుందనేది వారి భావన. ఈ జాబితాలో టీమ్‌ఇండియా స్పిన్ దిగ్గజం అనిల్ కుంబ్లే కూడా చేరిపోయారు. ఆసీస్‌తో ఇవాళ తొలి సెమీస్ నేపథ్యంలో భారత జట్టు కూర్పుపై తన విశ్లేషణను వెల్లడించాడు.**



"రెండు రోజుల వ్యవధిలో దుబాయ్ పిచ్ మారిపోతుందని అనుకోవడం లేదు. న్యూజిలాండ్‌తో మ్యాచ్ సందర్భంగా ఎలా ప్రవర్తించిందో.. అదే తీరున సెమీస్‌కూ ఉండొచ్చు. అందుకే, భారత్ మళ్లీ నలుగురు స్పిన్నర్లతో ఆడాలి. అందులో వరుణ్ చక్రవర్తి తప్పకుండా ఉండాలి. గత మ్యాచ్‌కు ఇప్పటికి కేవలం ఒకేఒక్క మార్పు మాత్రమే ఉండే అవకాశం ఉంది. అదీనూ కివీస్‌తో పోరులో రన్నింగ్ చేస్తుండగా షమీకి బంతి తాకింది. అతడికి విశ్రాంతి ఇచ్చి మరో పేసర్‌ను తీసుకొనే అవకాశం లేకపోలేదు. బౌలింగ్ చేస్తున్నప్పుడు షమీ ఇబ్బందేమీ పడలేదు. కానీ, అతడికి రెస్ట్ ఇవ్వాలనుకుంటే అర్ష్‌దీప్ లేదా హర్షిత్‌ను ఆడించొచ్చు. అయితే, అదనంగా జట్టులోకి మరొక పేసర్ మాత్రం అవసరం లేదు. పిచ్ పరిస్థితులు నలుగురు స్పిన్నర్లకు సరిపోతుంది. అంతా కలిసి దాదాపు 40 ఓవర్ల పాటు బౌలింగ్ చేస్తే తిరుగే ఉండదు. ఎలానూ ఇద్దరు పేసర్లు ఉన్నారు. భారత్ వద్ద బౌలింగ్ ఆప్షన్లు ఉండటంతో కంగారు అవసరం లేదు" అని కుంబ్లే తెలిపాడు.

### వరుణ్‌ను తీసుకోవడం అద్భుతమైన వ్యూహం: అశ్విన్

"న్యూజిలాండ్‌తో మ్యాచ్‌లో వరుణ్ చక్రవర్తిని తీసుకోవడం చాలా మంచి వ్యూహం. డారిల్ మిచెల్ వంటి బ్యాటర్‌కు ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా వరుణ్ సూపర్ బౌలింగ్ చేశాడు. బంతిని టర్న్ చేసిన విధానం బాగుంది. దానిని రీడ్ చేయడం కష్టమైంది. అతడిని కట్టడి చేయడంలో భారత్ సక్సెసైంది. రివర్స్ స్వీప్ చేసినప్పుడు ఫీల్డింగ్ సెటప్ కూడా అదుర్స్. చాలామంది ఈ మ్యాచ్‌కు ముందు వరుణ్‌ను తీసుకోవడంపై వ్యాఖ్యలు చేశారు. కానీ, అతడి ప్రదర్శన చూశాక ప్రశంసించకుండా ఉండలేకపోయారు. వరుణ్ బౌలింగ్‌ను ఆడటం ఎంతో రిస్క్. వేగంగా బంతులేయడం అతడి మరో ప్రత్యేకత. ఆసీస్‌తో మ్యాచ్‌లోనూ కీలకంగా మారతాడు. కుదిరితే అతడితోనే బౌలింగ్‌ను ప్రారంభించాలి. హెడ్‌ను కట్టడి చేసేందుకు ఆస్కారం ఉంటుంది" అని మాజీ క్రికెటర్ అశ్విన్ వ్యాఖ్యానించాడు.

# టాస్ విషయంలో.. రోహిత్ ప్రమాణం చేశాడేమో!: ఆకాశ్ చోప్రా

అంతర్జాతీయ క్రికెట్‌లో వరుసగా టాస్‌లను ఓడిన భారత సారథిగా రోహిత్ శర్మ కొనసాగుతున్నాడు. ఇప్పటివరకు వరుసగా 10సార్లు టాస్‌ను కోల్పోయాడు. ఓవరాల్‌గా బ్రియాన్ లారా (12), పీటర్ బోరెన్ (11) ముందున్నాడు. ఇప్పుడు ఛాంపియన్స్ ట్రోఫీ సెమీస్‌లో ఆస్ట్రేలియాతో టీమ్‌ఇండియా తలపడేందుకు సిద్ధమవుతోంది. ఒకవేళ ఇక్కడా టాస్ ఓడితే మాత్రం పీటర్ బోరెన్‌తో రోహిత్ సమంగా నిలుస్తాడు. ఛాంపియన్స్ ట్రోఫీలో గత మూడు మ్యాచుల్లోనూ భారత్ టాస్ నెగ్గలేదు. కానీ, మ్యాచుల్లో అద్భుతమైన విజయాలు సాధించింది. ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ భారత మాజీ క్రికెటర్ ఆకాశ్ చోప్రా ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు.

"వ్యక్తిగతంగా నేను టాస్ చాలా కీలకమని భావిస్తా. టాస్ గెలిస్తే ఏం తీసుకోవచ్చనేది మన చేతుల్లో ఉంటుంది. అయితే, గత కొన్ని మ్యాచులుగా మనం టాస్ గెలవలేదు. 'నేను టాస్ ఓడినా.. మ్యాచ్‌ను కోల్పోను' అని రోహిత్ (%=శీష్ట్రజ్ రాష్ట్రుతీమ్ఘు%) ప్రమాణం చేశాడేమోననిపిస్తుంది. ఇప్పుడంతా వినడానికి బాగుంటుంది. కానీ, టాస్ ఓడితే సమస్యే. ఎందుకంటే గత వన్డే ప్రపంచకప్ ఫైనల్‌లో ఆస్ట్రేలియా టాస్ నెగ్గింది. బౌలింగ్ ఎంచుకుంది. అది వారి ఆలోచన. అందుకు తగినట్టుగానే ఆడి ఫలితం రాబట్టారు. అందుకే టాస్ కీలకపాత్ర పోషించే అవకాశం ఉంది" అని వ్యాఖ్యానించాడు.

### కివీస్ చేసిన పొరపాటు అదే..

"గ్రూప్ స్టేజ్‌లో భారత్ (%×చీణ జం ఛ్గీ%)తో మ్యాచ్‌లో న్యూజిలాండ్ టాస్ నెగ్గి బౌలింగ్ ఎంచుకుంది. టీమ్‌ఇండియాను తొలుత బ్యాటింగ్ చేయమని ఆహ్వానించింది. ఇదే ఆ జట్టు చేసిన పొరపాటు. నలుగురు స్పిన్నర్లతో బరిలోకి దిగిన భారత్‌ను అడ్డుకొని లక్ష్య ఛేదన చేయడం చాలా కష్టం. ఆ మ్యాచ్‌కు ముందే నేను భారత్ 270 పరుగులు చేసినా చాలు విజయం సాధిస్తుందని చెప్పా. కానీ, 250 రన్స్‌ను కూడా కివీస్ ఛేదించడమూ కష్టమైంది. అందుకే, మైదానం గురించి పూర్తి అవగాహన ఉండాలి" అని చోప్రా వెల్లడించాడు.

# దుబాయ్‌లో మ్యాచ్.. భారత్‌పైనే ఒత్తిడి: ఆసీస్ మాజీ క్రికెటర్

**ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీలో కీలకమైన సెమీస్ పోరుకు వేళైంది. దుబాయ్ వేదికగా భారత్ - ఆస్ట్రేలియా జట్ల మధ్య తొలి సెమీఫైనల్ మ్యాచ్ జరగనుంది. ఇప్పటికే దుబాయ్ పిచ్ అడ్వాంటేజ్‌పై టీమ్‌ఇండియా కెప్టెన్ రోహిత్ శర్మ ఓ స్పష్టత ఇచ్చిన సంగతి తెలిసిందే. నాలుగు పిచ్‌ల్లో దేనిని వాడతారనేది తమకు తెలియదని.. తమకూ కొత్తదే అవుతుందని వ్యాఖ్యానించాడు. ఈ క్రమంలో ఆసీస్ మాజీ క్రికెటర్ బ్రాడ్ హడిన్ భారత్‌ను టార్గెట్ చేస్తూ కీలక వ్యాఖ్యలు చేశాడు. దుబాయ్‌లో వారికి అడ్వాంటేజ్ అంటూనే ఒత్తిడీ ఎక్కువగానే ఉంటుందని తెలిపాడు. అలాగే కోచ్ గౌతమ్ గంభీర్ సామర్థ్యాలకు కఠిన పరీక్షేనని వ్యాఖ్యానించాడు.**

### ఫైనల్ ముందు కంగారు..

"ఛాంపియన్స్ ట్రోఫీలో భారత్ మాత్రమే ఒకే మైదానంలో ఆడే అవకాశం కలిగిన జట్టు. దుబాయ్ పిచ్‌పై పచ్చిక ఉండదు. చాలా పొడిగా ఉంటుంది. భారత్‌కు చాలా సౌకర్యవంతమైన పిచ్. అదే సమయంలో టీమ్‌ఇండియాపైనే అదనపు ఒత్తిడి ఉంటుందని భావిస్తున్నా. ఇప్పటివరకు మంచి క్రికెట్ ఆడిన ఆ జట్టుకు కఠిన సవాల్ తప్పదు. మరోవైపు ఆస్ట్రేలియా కూడా సెమీస్‌కు చేరుకున్నందుకు గర్వపడుతున్నా. ఇప్పుడీ పోరులో ఆసీస్‌పై అసలు ఒత్తిడే లేదనుకుంటున్నా. తప్పకుండా భారత్‌ను ఓడించి ఫైనల్‌కు చేరే అవకాశాలు ఉన్నాయి. ఒకవేళ ఆసీస్ పరాజయం చెందినా పెద్దగా నిరుత్సాహపడాల్సిన అవసరం లేదు" అని వెల్లడించాడు.

### అంతా గంభీర్ పైనే..

ప్రధాన కోచ్‌గా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి గౌతమ్ గంభీర్‌కు గొప్ప ఫలితాలు దక్కలేదు. ఆసీస్, న్యూజిలాండ్ జట్లతో టెస్టు సిరీస్ ఓడిపోవడం ఇబ్బందిగా మారింది. ఇప్పుడు ఛాంపియన్స్ ట్రోఫీలో సెమీస్‌కు టీమ్‌ఇండియా సిద్ధమైంది. "భారత్‌పై ఒత్తిడి ఉంటుంది. అదే సమయంలో గౌతమ్ గంభీర్‌పై ఇంకాస్త అధికమనే చెబుతా. అతడు వచ్చాక తొలి ఐసీసీ టోర్నీ కావడంతో గెలవాలనే అంచనాలు మరింత ఎక్కువయ్యాయి. భారత్ ఫైనల్‌కు చేరుకోకపోతే మాత్రం పరిస్థితి విభిన్నంగా ఉండొచ్చు" అని హడిన్ వ్యాఖ్యానించాడు.



# అందరి దృష్టి సంచిత బసు పైనే..

ఒకప్పుడు టాలెంట్ ఉన్నవాళ్లు అవకాశాలను వెతుక్కుంటూ వెళ్లాల్సి వచ్చేది. తెరపై కనిపించేందుకు, ప్రజాదరణ పొందేందుకు సంవత్సరాల సమయం పడేది. కానీ సోషల్ మీడియా విప్లవంతో టాలెంట్‌ను చూపించుకోవడం, అవకాశాలను ఆకర్షించుకోవడం చాలా సులభమైపోయింది. అలాంటి సోషల్ మీడియా ప్రభావంతో వేగంగా ఎదిగిన బ్యూటీగా సంచిత బసు పేరు వినిపిస్తోంది.

**టిక్‌టాక్ నుంచి సినిమా వరకు**

సంచిత బసు 2004లో బీహార్‌లోని భాగల్‌పూర్‌లో జన్మించింది. చిన్నతనం నుంచే కళలకు ఆసక్తి కలిగిన ఆమె ఇంటర్ చదువుతున్నప్పుడే టిక్‌టాక్ ద్వారా ప్రజాదరణ పొందింది. చిన్న చిన్న వీడియోలతో తన హావభావాలతో ఆకట్టుకున్న సంచిత, ఆ తర్వాత ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లో మరింత పాపులర్ అయ్యింది. ప్రత్యేకంగా దక్షిణాది భాషల్లోనూ ఆమెకు ఫ్యాన్ ఫాలోయింగ్ పెరిగింది. సోషల్ మీడియా స్టార్‌గా మారిన సంచిత బసు 2022లో తెలుగు ఇండస్ట్రీలో అడుగుపెట్టింది. 'ఫస్ట్ డే ఫస్ట్ షో' అనే సినిమాతో కథానాయికగా పరిచయమైంది. అయితే సినిమా ఆశించిన స్థాయిలో విజయం సాధించకపోవడంతో ఆమెకి పెద్దగా గుర్తింపు రాలేదు. కానీ ఆమె అందం, ఆకర్షణీయమైన హావభావాలు ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించాయి.

**ఓటీటీ లో దూసుకుపోతున్న సంచిత**

సినిమాలో పెద్దగా అవకాశాలు రాకపోయినా, సంచిత బసు వెబ్‌సిరీస్‌ల ద్వారా తన మార్క్ వేసింది. ఇటీవల విడుదలైన 'తుజ్రా కే మేరా ప్యార్' అనే వెబ్‌సిరీస్ ఆమెను మరోస్థాయికి తీసుకెళ్లింది. ఈ సిరీస్‌లో ఆమె నటన విశేషంగా ప్రశంసలు అందుకుంది. ఫలితంగా అభిమానులు ఆమెను 'ఓటీటీ క్వీన్'గా పిలవడం మొదలు పెట్టారు. సంచిత బసు అందం, టాలెంట్, స్క్రీన్ ప్రెజెన్స్ కారణంగా దక్షిణాది సినిమాల్లో అవకాశాలు పెరుగుతున్నాయని టాలీవుడ్ వర్గాల్లో టాక్ నడుస్తోంది.

ప్రత్యేకంగా ఆమె రూపం, హావభావాలు సీనియర్ నటి అంజలి తరహాలో ఉండటంతో, ప్రేక్షకులు త్వరలో ఆమెను మరిన్ని చిత్రాల్లో చూడబోతున్నారని అంటున్నారు. సంచిత బసు ఇప్పటివరకు వెబ్‌సిరీస్‌లలోనే ఫోకస్ పెట్టినా, త్వరలోనే ఆమెను టాలీవుడ్ సినిమాల్లో కథానాయికగా చూసే అవకాశాలు ఉన్నాయంటూ ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. వెబ్‌సిరీస్‌లకు, టాలీవుడ్‌కు సరిసమానంగా సమయం కేటాయిస్తూ, మరిన్ని కొత్త ఛాలెంజింగ్ రోల్స్ చేయాలని ఆమె ఆసక్తిగా ఎదురుచూస్తోంది. సోషల్ మీడియా ద్వారా స్టార్‌డమ్‌ను సంపాదించుకుని, వెబ్‌సిరీస్‌లతో తన ప్రత్యేకతను చాటుకున్న సంచిత బసు త్వరలోనే టాలీవుడ్‌లో బిజీ హీరోయిన్‌గా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. మరి, ఆమె ఏ రేంజ్ స్టార్‌గా ఎదుగుతుందో చూడాలి.



# సంక్రాంతికి వస్తున్నాం సినిమా పై అనిల్ రావిపూడి ఎమోషనల్ పోస్ట్




సంక్రాంతికి వస్తున్నాం' సినిమా థియేటర్లలో తన హవాను కొనసాగిస్తూనే, టీవీలు, ఓటీటీల్లో కూడా సందడి చేసేందుకు సిద్ధమవుతోంది.

సినిమా విడుదలై 50 రోజులు పూర్తి చేసుకున్నా, ఇప్పటికీ థియేటర్లలో ప్రేక్షకుల రద్దీ తగ్గలేదు. నేటి వరకు 92 సెంటర్లలో 50 రోజుల ప్రదర్శనను పూర్తి చేసుకోవడం,ఒక రీజినల్ మూవీ విభాగంలో ఆల్‌టైమ్ ఇండస్ట్రీ హిట్‌గా నిలవడం విశేషంగా మారింది. ట్రేడ్ వర్గాల ప్రకారం, ఈ సినిమా ఇప్పటికే రూ. 300 కోట్లకుపైగా వసూళ్లను సాధించి, కొత్త రికార్డును సృష్టించింది.

**అనిల్ రావిపూడి భావోద్వేగ పోస్ట్**

సినిమా 50 రోజుల ఘనతను పురస్కరించుకుని, దర్శకుడు అనిల్ రావిపూడి సోషల్ మీడియా వేదికగా తన భావోద్వేగాలను పంచుకున్నారు. 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా ఓ ఎమోషనల్ పోస్ట్ పెట్టిన అనిల్, ప్రేక్షకుల అభిమానానికి హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలియజేశారు."92 సెంటర్లలో 50 రోజులు పూర్తి కావడం మా ఎగ్జిబిటర్లు, పంపిణీదారుల అంకితభావంతోనే సాధ్యమైంది. వారు సినిమాను అన్ని ప్రాంతాలకు చేర్చారు. మా సినిమా మీద మీ అందరి అపారమైన ప్రేమ, బ్లాక్‌బస్టర్ పొంగలు ఇచ్చినందుకు నా హృదయపూర్వక ధన్యవాదాలు," అని అనిల్ రావిపూడి తెలిపారు.

**వెంకటేశ్‌తో మరపురాని ప్రయాణం**

విక్టరీ వెంకటేశ్‌తో ఈ మరపురాని ప్రయాణాన్ని తాను ఎప్పటికీ గుర్తుంచుకుంటానని తెలిపారు.ఆయనతో కలిసి పని చేయడం గొప్ప అనుభవం. ఈ ప్రయాణాన్ని ఎప్పటికీ మర్చిపోలేను" అని అన్నారు.

**నిర్మాతలకు, టీమ్‌కి స్పెషల్ థ్యాంక్స్**

సినిమా విజయానికి తోడ్పడ్డ నిర్మాతలు దిల్ రాజు, శిరీష్‌లకు, అలాగే సంగీత దర్శకుడు భీమ్స్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ చారిత్రాత్మక విజయాన్ని అందించేందుకు తోడ్పడిన నటీనటులు, సాంకేతిక బృందానికి అనిల్ రావిపూడి ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు.



# చీర కట్టులో ఇస్మార్ట్ బ్యూటీ సూపర్

నన్ను దోచుకుందువటే సినిమాతో 2018లో తెలుగు ప్రేక్షకులకు హీరోయిన్‌గా పరిచయం అయిన ముద్దుగుమ్మ నభా నటేష్. మొదటి సినిమాతోనే అందంతో పాటు నటనతోనూ మెప్పించిన ఈ అమ్మడు టాలీవుడ్‌లో ఆ వెంట వెంటనే సినిమాల్లో ఆఫర్లు దక్కించుకుంది. టాలీవుడ్‌లో అడుగు పెట్టిన తదుపరి ఏడాదిలోనే డాషింగ్ డైరెక్టర్ పూరి జగన్నాథ్ దర్శకత్వంలో రామ్ కి జోడీగా ఇస్మార్ట్ శంకర్ సినిమాలో నటించే అవకాశం దక్కించుకుంది. ఆ సినిమాలో నటనతో మరోసారి తన సత్తా చాటింది. ఇస్మార్ట్ శంకర్ సూపర్ హిట్ కావడంతో పాటు నభా నటనకు విమర్శకుల ప్రశంసలు దక్కాయి, ఆమె డైలాగ్ డెలివరీ అన్నింటికి పాజిటివ్ రెస్పాన్స్ దక్కింది. ఇస్మార్ట్ శంకర్ తర్వాత పలు సినిమాల్లో నటించిన నభా నటేష్ కొన్ని కారణాల వల్ల 2022, 23 లో సినిమాల్లో కనిపించలేదు. గత ఏడాది 'డార్లింగ్' అనే వెబ్ మూవీలో కనిపించింది. మరోసారి తన నటనతో మెప్పించింది. డార్లింగ్‌తో మరోసారి నభా నటేష్ బిజీ అయ్యే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం స్వయంభూ సినిమాలో నటిస్తున్న నభా నటేష్ మరో రెండు మూడు సినిమాలకు సంబంధించిన చర్చలు జరుగుతున్నట్లు సమాచారం అందుతోంది. త్వరలో నభా నటేష్ కొత్త సినిమాలకు సంబంధించిన అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది.

సినిమాలతో ఈమధ్య కనిపించకున్నా నభా నటేష్ ఫోటో షుట్స్‌లతో ఎప్పుడూ వార్తల్లో నిలుస్తుంది. తాజాగా మరోసారి అందమైన ఫోటోలతో కన్నుల విందు చేసింది. నభా నటేష్ ఆకట్టుకునే రూపం కారణంగా చీర కట్టులో ఎప్పుడూ చాలా చక్కగా అందంగా కనిపిస్తూ ఉంటుంది. ఎప్పటిలాగే తాజాగా మరోసారి చీర కట్టు ఫోటోల్లో ఆకట్టుకుంది. ఈసారి అంతకు మించి అనిపించేలా అందమైన చీర కట్టులో జుట్టులో మల్లెపూలు ధరించి కొంటెగా చూస్తూ కెమెరాకు ఫోజ్ ఇచ్చింది. అందమైన నభా నటేష్ ఈ చీర కట్టులో మరింత అందంగా కనిపిస్తుంది అంటూ నెటిజన్స్, అభిమానులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. నభా నటేష్ అందమైన ఫోటో షుట్ వైరల్ కావడం కొత్తేం కాదు. గతంలో ఎన్నో సార్లు ఆమె స్కిన్ షో చేసిన ఫోటోలు వైరల్ అయ్యాయి. అయితే ఇలా నిండైన చీర కట్టులోనూ అందంగా కనిపిస్తుంది అంటూ ఈ ఫోటోలను సైతం నెటిజన్స్ తెగ షేర్ చేస్తున్నారు. చీర కట్టు ఫోటోలకు ఈ స్థాయి రెస్పాన్స్ దక్కడం చాలా అరుదుగా ఉంటుంది. నభా నటేష్ మోడ్రన్ డ్రెస్‌లతో పాటు ఇలా చీర కట్టులోనూ చాలా అందంగా ఉందంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. నభా నటేష్ ఇంతటి అందానికి దక్కాల్సిన ఆఫర్లు దక్కడం లేదని, ఇండస్ట్రీలో టాప్ స్టార్ హీరోయిన్‌గా ఈ అమ్మడు సినిమాలు చేయాలని ఫ్యాన్స్ అంటున్నారు.

## 7న 'సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు' రీ రిలీజ్

సుమారు 12 ఏళ్ల తర్వాత విడుదలైన 'సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు' సినిమా ఈనెల 7న రీ రిలీజ్ కానుంది. దీని ట్రైలర్‌ను మేకర్లు విడుదల చేశారు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్‌పై దిల్‌రాజు ఈ చిత్రాన్ని నిర్మించారు. శ్రీకాంత్ అడ్డాల కథతో పాటు దర్శకత్వం వహించారు. మిక్కీ జె.మేయర్ సంగీతం వహించారు. ఈ చిత్రంలో వెంకటేష్, మహేష్‌బాబు, అంజలి, సమంత తదితరులు నటించారు. ఈ సినిమా రీ రిలీజ్ సందర్భంగా ట్రైలర్‌ను చిత్ర యూనిట్ విడుదల చేసింది.




TELUGU RASTRAM . Printed, Published and Owned by AITHABATHULA RAJASEKHAR. Printed at Ajay Sri Printers, D.No. 4/151, Aithabathulavari centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P Published at D.No. 4-151, Aithabathulavari Centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P. Editor: AITHABATHULA RAJASEKHAR, . RNI NO. APTEL/2016/66202, email: telugurastram2016@gmail.com, Phone No. 8074368339